

రోజాను అడ్డుకుంటున్న వారికి నచ్చజెబుతున్న మంత్రి సెక్యూరిటీ సిబ్బంది

ఏం మేలు చేశారని మళ్లీ వచ్చారు?

మంత్రి రోజాను అడ్డుకున్న ఎస్బీఆర్ పురం ఎస్టీ కాలనీవాసులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24 : మాకేం మేలు చేశారని ఓట్లడగడానికి వచ్చారంటూ మంత్రి రోజాను ఎస్టీలు నిలదీశారు. వడమాల పేట మండల పరిధిలోని ఎస్బీఆర్ పురం పంచాయతీ ఎస్టీ కాలనీవాసులు బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారానికి వచ్చిన రోజాను పొలిమేరలోనే అడ్డుకున్నారు.తమ గ్రామంలో కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించలేదంటూ ఫైర్ అయ్యారు.గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామని, స్మశానానికి స్థల సమస్య తీరుస్తానని గత ఎన్నికలకు ముందు రోజా కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఐదేళ్లు పూర్తయినా ఒక్క సమస్యను కూడా పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.రేపటి లోపల సమస్యను పరిష్కరిస్తానని మంత్రి రోజా నచ్చజెప్పినప్పటికీ ఎస్టీ కాలనీవాసులు విశ్వసించలేదు. ఎట్టి పరిస్థితుల్లో తమ గ్రామంలో అడుగు పెట్టకూడదని పొలిమేర వద్దే అడ్డుతగిలారు. దీంతో చేసేది లేక మంత్రి రోజా వెనుదిరిగారు.

వైసీపీ దౌర్జన్య కాండ





దొడ్డాపురం వీధిలో ఉద్రిక్త పరిస్థితులు

ప్రచారం ముసుగులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు

ఘర్షణకు దిగడంతో ఓ కార్యకర్తకు గాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24: తిరుపతిలో ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఎన్డీయే కూటమి అభ్యర్థి తరఫున ప్రచారం చేసే నాయకులు, కార్యకర్తలను వైసీపీ కార్యకర్తలు వెంటాడుతున్నారు. బుధవారం 27వ డివిజన్‌లోని దొడ్డాపురం వీధిలో టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం చేస్తుండగా.. వైసీపీ తరఫున ప్రచారం చేస్తున్న వేణు, ధీరజ్, కార్పొరేటర్ శైలజ, ఫణీ తమ్మ, ఉష, నరసింహ తదితరులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొంత పక్కకు తప్పుకుంటే తాము ప్రచారం చేసుకుంటామని టీడీపీ, జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. కానీ వైసీపీ నాయకులు మెట్టు దిగకపోవడంతో అక్కడ కాసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెరో వైపు మళ్లించేందుకు యత్నించారు. అయినా స్థానిక వైసీపీ నాయకులు ఉదయ్‌వంశీ, సురేష్, ముద్ర ప్రసాదు, తదితరులు మరోసారి రెచ్చగొడుతూ ఎన్డీయే కార్యకర్తల పైకి దూసుకొచ్చేందుకు యత్నించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో ఎన్డీయే కార్యకర్త ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. ఓ పార్టీ ప్రచారం చేస్తుండగా మరో పార్టీకి పోలీసులు ఎలా అనుమతిస్తారని ఎన్డీయే నాయకులు ప్రశ్నిస్తున్నారు.

జబ్బారు లేఅవుట్‌లోనూ..

తిరుపతి జబ్బారు లేఅవుట్‌లో ఎన్డీయే కూటమి నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో వైసీపీ శ్రేణులు దాడికి యత్నించాయి. 26వ డివిజన్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రచారం చేస్తుండగా స్థానిక కార్పొరేటర్ ఆఫీసు వద్ద వైసీపీ కార్యకర్తలు ప్రచారం పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అయినా శాంతియుతంగా ఎన్డీయే ప్రచారం చేయడంతో ఎటువంటి వివాదం తలెత్తలేదు.

చంద్రగిరిలోనూ వైసీపీ రగడ

- టీడీపీ కళా బృందం ప్రదర్శనలో వైసీపీ ప్రచార రథం



టీడీపీ కళాబృందం వద్ద పెట్టిన వైసీపీ ప్రచార వాహనం

చంద్రగిరి, ఏప్రిల్ 24: చంద్రగిరిలోనూ టీడీపీ నేతలతో బుధవారం వైసీపీ శ్రేణులు రగడకు దిగాయి. గురువారం చంద్రగిరి టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమం పెట్టుకున్నారు. ఈ క్రమంలో తమ అభ్యర్థి నాగాలమ్మ ఆలయంలో పూజలు చేస్తారని చెప్పి తొండవాడ పంచాయతీ పరిధిలో ఉన్న ఉగ్రప్రత్యంగిరా దేవాలయం నుంచి చంద్రగిరి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా వైసీపీ జెండాలను పాతేశారు. అలాగే టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని కూడా నాగాలమ్మ ఆలయంలో పూజలు చేసి, నామినేషన్‌కు వెళ్లనుండటంతో టీడీపీ జెండాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం టీడీపీ జెండాలను తొలగించాలంటూ వైసీపీ శ్రేణులు పట్టుబట్టాయి. పైగా తమ జెండాలు పాతడానికి అనుమతి ఉందంటూ వైసీపీ శ్రేణులు రగడకు దిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులొచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపేశారు.ఆ తర్వాత కూడా.. టీడీపీ కళాజాత బృందం ప్రదర్శన చంద్రగిరి ఫ్లైఓవర్ వద్ద జరుగుతుండగా వైసీపీ ప్రచార వాహనాన్ని కూడా అక్కడే పెట్టి సౌండ్ పెంచారు. విషయం తెలుసుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అక్కడికి వచ్చి వైసీపీ ప్రచార రథం తీసుకెళ్లిపోవాలని చెప్పినా వినిపించుకోలేదు. చివరకు పోలీసులు రావడంతో వైసీపీ ప్రచార రథం అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు.





వెంకటగిరిలో భారీ ప్రదర్శనగా నామినేషన్ కేంద్రానికి వెళుతున్న టీడీపీ అభ్యర్థి రామకృష్ణ

ఆరవరోజు 72నామినేషన్లు

తిరుపతి పార్లమెంటుకు 8.. అసెంబ్లీకి 59 మంది దాఖలు

నేటితో ముగియనున్న నామినేషన్ల జాతర

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలకఘట్టమైన నామినేషన్ల ప్రక్రియకు నేటితో తెరపడనుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ అడపా దడపా మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి.ఆరవరోజైన బుధవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. తిరుపతి పార్లమెంటుకు ఎనిమిది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 59 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగియనుంది.కాగా గురువారం చంద్రగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరఫున పులివర్తి నాని, వైసీపీ తరఫున చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. తిరుపతి లోకసభ స్థానానికి బుధవారం వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ మద్దెల గురుమూర్తి రెండవ సారి నామినేషన్లు అందజేశారు. ఆయన సతీమణి నవ్యకిరణ్ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున అంజయ్య, సమాజ్‌వాదీ పార్టీ నుంచి తేజోవతి, అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ నుంచి భరణిబాస్, యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పుణ్యమూర్తి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి శివ, ఇండిపెండెంట్‌గా దాసరి గౌతమ్ నామినేషను పత్రాలు సమర్పించారు.వెంకటగిరి అసెంబ్లీకి టీడీపీ నుంచి కురుగొండ్ల రామకృష్ణ బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు భారీ ర్యాలీగా ఆయన నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ర్యాలీకి తరలివచ్చిన టీడీపీ శ్రేణులతో వెంకటగిరి వీధులు నిండిపోయాయి.పూలతో అలంకరించిన చైతన్య రథంపై ఎక్కిన కురుగొండ్ల రామకృష్ణ ర్యాలీకి ముందు సాగారు. కాగా టీడీపీ డమ్మీ అభ్యర్థిగా కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ, బీఎస్పీ నుంచి జయచంద్రయ్య, ఇండిపెండెంట్లుగా కె.వెంకటేశ్వర్లు, వెంకటాచలపతి నామినేషన్లు అందజేశారు.గూడూరు అసెంబ్లీకి కాంగ్రెస్ తరఫున డాక్టర్ రామకృష్ణారావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పోలమ్మ, ఐబీపీ తరఫున కాకర్ల రమేష్, ఇండిపెండెంట్లుగా శివకుమార్, రమణయ్య, వెంకయ్య నామినేషన్లు అందజేశారు.సూళ్ళూరుపేటకు టీడీపీ నుంచి నెలవల విజయశ్రీ, డమ్మీ అభ్యర్థిగా నెలవల రాజేష్, కాంగ్రెస్ తరఫున సి.శివ, కె.హరికృష్ణన్, బీఎస్పీ నుంచి రమణయ్య, ఇండిపెండెంట్‌గా అరుణ, సత్యవేడు అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం కుమారుడు సుమన్‌కుమార్ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ డమ్మీ అభ్యర్థులుగా రమేష్‌బాబు, జె.రాజశేఖర్, నీతి నిజాయితీ పార్టీ తరఫున ఎ.చిట్టిబాబు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి కిరణ్, ఇండిపెండెంట్‌గా .రాజశేఖర్, సురేష్, కె.వెంకటాచలం, శ్రీకాళహస్తికి వైసీపీనుంచి బియ్యపు మధుసూదన్‌రెడ్డి,జై భారత్ నేషనల్ పార్టీ తరఫున రొమ్మల నిరంజన్‌రెడ్డి, బీఎస్పీ నుంచి సురేంద్రబాబు, ఇండిపెండెంట్లుగా శ్రీనివాసులురెడ్డి, సురేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, ఎల్లయ్య, తిరుపతి నుంచి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, డమ్మీ అభ్యర్థిగా సత్యవతి,సీపీఐ నుంచి మురళి, బీఎస్పీ నుంచి వేణుగోపాలరాజు, అఖిల భారతీయ జనసంఘ్ నుంచి బాబు రాజేంద్రప్రసాద్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి శ్రీనివాసకుమార్, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి నుంచి జయకుమార్, ఇండిపెండెంట్లుగా తిరుమల, అక్కుపల్లి మునికృష్ణయ్య, శరవణ, రేఖ, మంజుల,సుబ్రహ్మణ్యం, చంద్రగిరి నియోజకవర్గం నుంచి యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మోహన్ దిలీప్‌కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ తరఫున తురకా అమర్‌నాథ్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఈశ్వరయ్య, మనదేశం పార్టీ నుంచి జి.ఫరూక్, ఇండిపెండెంట్లుగా వినీల్ సాయివర్ధన్‌రెడ్డి పులివర్తి, శరవణ, నవీన్ రెడ్డి, రాము, ముని బాల చంద్ర, రాంబాబు, విజయకుమార్, రాజేష్, మణికంఠ నామినేషన్లు దాఖలు చేశారు.

28న పాపానాయుడుపేటకు బాలకృష్ణ

ఏర్పేడు, ఏప్రిల్ 24: ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈనెల 28వ తేదీ ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు రానున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించనున్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24: వడదెబ్బకు గురై మరో మహిళ చనిపోయింది. మృతురాలి కుటుంబసభ్యుల కథనం మేరకు... పుత్తూరు మండల పరిధిలోని తడుకు పంచాయతీ వీఎస్ఎస్ పురానికి చెందిన వ్యవసాయ కూలీ టి.రాజమ్మ బుధవారం ఎండ తీవ్రత భరించలేక ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందింది.

కనులపండువగా సూర్యపూజ

తడ, ఏప్రిల్ 24:వేనాడు దీవిలోని శృంగీశ్వర రంగపెరుమాల్ ఆలయంలో బుధవారం సాయంత్రం భానుడి కిరణాలు మూల విరాట్ రంగనాథుడి పాదాలను తాకాయి.యేటా చైత్ర పౌర్ణమి నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ సూర్యపూజోత్సవం, మహా లక్షార్చన నిర్వహిస్తారు.మూల విరాట్ రంగ పెరుమాల్‌పై సూర్యస్తమయ సమయంలో భానుడి కిరణాలు విష్ణుమూర్తి పాదాలను తాకుతాయి. సాయంత్రం 5.45గంటల సమయంలో భానుడి కిరణాలు ద్వార గోపురం, బలిపీఠం, ధ్వజస్తంభాలను తాకుతూ ఆలయంలోకి ప్రవేశించి స్వామివారి పాదాలను తాకి అనంతరం స్వామివారి నాభికి చేరి ముఖం, శిరస్సు వరకు చేరాయి. ఆ సమయంలో స్వామివారికి తులసి అర్చన, పాలాభిషేకం నిర్వహించారు.



రంగనాథుడి పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు

ఈ శునకం ధర రూ.20కోట్లు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 24 : వరదయ్యపాళెంలోని ఏకం ఆధ్యాత్మిక క్షేత్రంలో బుధవారం సాయంత్రం రూ.20 కోట్ల ధర పలికే ఓ శునకం అందరినీ ఆకర్షించింది.ఏకం సందర్శనకు వచ్చిన బెంగళూరుకు చెందిన ఇండియన్ డాగ్ బ్రీడర్ అసోసియేషన్ అధ్యక్షుడు,టీవీ నటుడు అయిన సతీష్ ఈ శునకాన్ని తీసుకొచ్చారు. కాకాసియన్ షెపర్డ్ జాతికి చెందిన ఈ కుక్కను శునక ప్రేమికుడైన సతీష్ పెంచుకోవడంతో పాటు ఊరూరా తిప్పుతున్నారు.



రేపు సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్
- 67మందికి బంగారుపతకాలు, 580మందికి డిగ్రీలు ప్రదానం



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్, ఏప్రిల్ 24: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు యూనివర్సిటీలోని ఇండోర్‌స్టేడియం జరగనుంది. చాన్సలర్ ఎన్.గోపాలస్వామి అధ్యక్షతన జరిగే ఈస్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ హాజరవుతున్నారని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ మాట్లాడుతూ.. సెంట్రల్‌వర్సిటీ హోదా పొందాక నిర్వహించే ఈ స్నాతకోత్సవం ప్రత్యేకమైందని చెప్పారు. 2022-23 విద్యాసంవత్సరంలో వర్సిటీలో పలు యూజీ, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా,సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన 580 మందికి డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే వివిధ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి, ప్రథమస్థానం సాధించిన 67మందికి బంగారుపతకాలను ఉప రాష్ట్రపతి అందిస్తారని చెప్పారు. విశిష్ట అతిథిగా ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య హాజరై.. భారతీయ జ్ఞానపరంపరకు సంబంధించి రచించిన పలు పుస్తకాలను విడుదల చేస్తారని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, సీవోఈ డాక్టర్ కె.సాంబశివమూర్తి, ఏపీఆర్వో డాక్టర్ కనపాల కుమార్, డాక్టర్ బుల్దీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల మీటింగు పేరుతో వైసీపీ ప్రచారమా?

- చర్యలు తీసుకోవాలన్న టీడీపీ నేతలు

కోట, ఏప్రిల్ 24:ముస్లింల సమావేశం పేరుతో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవా లంటూ టీడీపీ నాయకులు పట్టుబట్టారు. కోట పట్టణం లో బుధవారం జరిగిన ముస్లిం మైనార్టీ నియోజకవర్గ సమావేశం టీడీపీ నేతల అభ్యంతరాలు, అధికారుల విచారణల నడుమ ముగిసింది. కోటలోని రెడ్డి సంక్షేమభవన్‌లో వైసీపీ నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, వైసీపీ మైనారిటీ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని ముస్లింలను వైసీపీకి ఓటు వేయాలని ప్రలోభ పెడుతున్నారంటూ టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో శంకరయ్యకు ఫిర్యాదు చేశారు.ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఇలాంటి సమావేశాలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.వెంటనే చర్యలు తీసుకోవాలని కోరడంతో ఎంపీడీవో శంకరయ్య రెడ్డి సంక్షేమ భవనానికి వెళ్లారు.అక్కడ వైసీపీ నేతలను సమావేశ వివరాలు అడిగి తెలుసుకున్నారు.దీంతో వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఏడాది క్రితమే తన పదవీ కాలం పూర్తయ్యిందని, తనపై పోలీస్ కేసు పెడితే తేల్చుకుంటానని ఖాదర్‌బాషా ఎంపీడీవోతో వాగ్వాదానికి దిగారు.చైర్మన్ పదవీ కాలానికి సంబంధించిన పత్రాలను తీసుకున్న ఎంపీడీవో దీనిపై కలెక్టర్‌కు, ఆర్వోకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.



రెడ్డిభవన్‌లో వైసీపీ నేతలను ప్రశ్నిస్తున్న ఎంపీడీవో

సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు తోడ్పాటు


ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, ఏప్రిల్ 24: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు మేలు జరుగుతుందని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ అన్నారు. భాకరాపేట పంచాయతీ వడ్డిపల్లె, మాదిగపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో బుధవారం ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ సునీత దామోదరం, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, లోకనాథం, తులసీ రాయల్, యశ్వంత్ రాయల్, విజయ్ కుమార్, మునిచంద్ర, ప్రకాశ్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్ మనోవికాస్‌కు కాస్ విరాళం



విరాళం అందజేస్తున్న కాస్ ప్రతినిధులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 24: తిరుపతిలోని పాస్ మనో వికాస్ సేవా సంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం(కాస్) ప్రతినిధులు ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లల కోసం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కాస్ అధ్యక్షుడు పురందర నాయుడు మాట్లాడుతూ.. ఇంత మంది మనోవైకల్యం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్న మురళీకృష్ణను అభినందిస్తూ, ఇకపై ఏటా కాస్ తరపున విరాళం అందజేస్తామని ప్రకటించారు. అలాగే ప్రముఖ వైద్యులు, రీచ్‌గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల తరపున మరో రూ.10,116 చెక్కును కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాస్ కార్యనిర్వాహక కార్యదర్శి వేమూరి జయరామ్ ప్రసాద్, సభ్యులు జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి 28న భూమిపూజ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 24: ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద ఉన్న సీతమ్మనగర్‌లో ఈ నెల 28వ తేదీన కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమిపూజ జరగనుంది. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం సాయంత్రం పాలక మండలి సభ్యులతో కలిసి చైర్మన్ పామిడి సత్యనారాయణ శెట్టి ఆవిష్కరించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం, పంగులూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మకర్తల పాలక మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పాలక మండలి కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు, కోశాధికారి శిరీషమంజునాథ్, నామా వరదరాజులు, కోటా రవి చంద్రశేఖర్, కొండూరు మహేష్, పొట్టి లక్ష్మణ్, రాణెమ్మ, సాయిప్రకాశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ పోరంబోకు ఆక్రమించి రేకుల షెడ్ వేసేశారు..!


ఎర్రమిట్ట వద్ద కాలువ పోరంబోకుపై అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్


మంగళం, ఏప్రిల్ 24: తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని ఎర్రమిట్టలో 101/4 సర్వే నెంబరులో 20 అడుగుల కాలువను ఆక్రమించి దానిపై రేకుల షెడ్‌నే కట్టేశారు. గత కొద్ది రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా రెవెన్యూ అధికారులకు ఆక్రమణకు సంబంధించి ఫొటోలతో సహా సమాచారం అందించినా పట్టించుకున్న పాపానపోలేదు. దీనిపై స్థానిక ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆక్రమణల వెనుక రెవెన్యూ అధికారుల మద్దతు ఉండవచ్చని, లేకుంటే ఇంత దర్జాగా కబ్జా జరగడం అసాధ్యమని అంటున్నారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు


వైష్ణవి, చర్మిళ, రిషిత, కార్తీక్, గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

తిరుమలేశుడి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ ఆర్‌ఎంటీ టీకా రామన్

తిరుమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌ఎంటీ టీకా రామన్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొ క్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 24: భార్య హత్య కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్ వివరాలను వెల్లడించారు. వరదయ్యపాళెం మండలం సంతవేలూరు పంచాయతీ సాధనవారిపాళెం గ్రామానికి చెందిన తూకివాకం రాజశేఖర్ ఏప్రిల్ 19వ తేదీ రాత్రి తన భార్య అంజలి(24)తో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో భార్య గొంతు నులమడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమె తల్లిదండ్రులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ 20వ తేదీన మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ - సూళ్లూరుపేట మార్గంలో సాధనావారిపాళెం బస్టాప్ వద్ద నిందితుడు రాజశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

చంద్రగిరి

అదుపు తప్పి కారు బోల్తా
దంపతులకు గాయాలు



చంద్రగిరి, ఏప్రిల్ 24: మండలంలోని అగరాల వద్ద బుధవారం పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో కారులో ఉన్న దంపతులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు తిరుపతిలోని శ్రీనిధి రెసిడెన్సీకి చెందిన సుబ్రమణ్యం, ఆయన సతీమణి శిరీషలు కారులో తిరువణ్ణామలైకు వెళ్లి తిరిగి తిరుపతికి వస్తుండగా మార్గమధ్యంలో అగరాల వద్దకు రాగానే అదుపు తప్పి జాతీయ రహదారిలో నుంచి సర్వీసు రోడ్డులోకి వచ్చి పక్కనున్న ఖాళీ స్థలంలో పడిపోయింది. ఈప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు కాగా అందులో ఉన్న దంపతులు సుబ్రమణ్యం, శిరీషలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం


ఓటు అభ్యర్థిస్తున్న చింతా మోహన్

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 24: రాయలచెరువు రోడ్డు, రైతు బజార్, సత్యనారాయణపురం, గాంధీపురం పరిసర ప్రాంతాల్లో బుధవారం తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చింతా మోహన్ ఎన్నికల ప్రచారం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కి అనుకూల గాలి వీస్తోందని చెప్పారు. కాంగ్రెస్ నేతలు గోపీ గౌడ్, శాంతి యాదవ్, తేజోవతి, మునిశోభ, వెంకటేష్‌గౌడ్, కడియాల భానుప్రకాష్ పాల్గొన్నారు.

నేడు పులివర్తి నామినేషన్

తిరుచానూరు/తిరుపతి రూరల్/చంద్రగిరి, ఏప్రిల్ 24: టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థిగా పులివర్తి నాని గురువారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున తరలిరానున్నారు. నాని దంపతులు ఉదయం 5గంటలకు చంద్రగిరి నాగాలమ్మ ఆలయంతో పాటు గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. చంద్రగిరి క్లాకటవర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తారు. అనంతరం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని రఘునాథ్ రిసార్ట్స్‌లోని ఇంటికి చేరుకుంటారు. ఉదయం 9గంటలకు అగ్రహారం (సదరన్‌స్పైస్ హోటల్) సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీతో నామినేషన్ వేసేందుకు తరలివెళతారు. చంద్రగిరి రిటర్నింగ్ అధికారికి నామినేషన్‌పత్రాలను అందజేయనున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

తిరుపతి రూరల్ మండల పార్టీ కార్యాలయంలో బుధవారం తుమ్మలగుంట, మల్లంగుంట, ఓటేరు, చెర్లోపల్లె, చంద్రగిరి మండలం రాయలపురం, తొండవాడ గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు.


టీడీపీ నేతలు బిరుదాల భాస్కర్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్ రెడ్డిల నేతృత్వంలో తుమ్మలగుంట వైసీపీ నేతలకు పసుపు కండువాలు కప్పుతున్న పులివర్తి నాని, పక్కన ఈశ్వరరెడ్డి, డాలర్ దివాకర్ రెడ్డి


మల్లంగుంటకు చెందిన మునికృష్ణారెడ్డి నేతృత్వంలో వైసీపీ నేతలు పొట్టేలు మునస్వామియాదవ్ తదితరులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నాని, పక్కనే బడి సుధా యాదవ్, గణపతి నాయుడు, దిలీప్ కుమార్‌యాదవ్



ఓటేరుకు చెందిన వైసీపీ నేతలతో నాని, సైకం జయచంద్రారెడ్డి, చెర్లోపల్లెకి చెందిన వైసీపీ నేతలతో నాని, శ్రీధర్ నాయుడు



టీడీపీలో చేరిన చంద్రగిరి మండలం రాయలపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు, తొండవాడ పంచాయతీ వైసీపీకి చెందిన దళిత, గిరిజన సంఘం నాయకులు

ఎప్పటికి పూర్తిచేస్తారో?

- తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో సా...గుతున్న నిర్మాణ పనులు


అసంపూర్తిగా వున్న రేకులషెడ్లు, పాడైన ప్లాట్‌ఫారం ఫ్లోరింగ్, పెరిగిన ముళ్ల చెట్లు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్ 24: తిరుచానూరు రైల్వే స్టేషన్ నూతన భవనాల నిర్మాణపనులు నత్తనడక కంటే అధ్వానంగా సాగుతున్నాయి. ఎంత కాలానికి పూర్తి చేస్తారో కూడా తెలియలేదు. తిరుమల పుణ్యక్షేత్రానికి తిరుపతి రైల్వేస్టేషన్ కీలకం కావడంతో రైళ్ల రద్దీ పెరిగింది. ఈ రద్దీని తగ్గించడానికి తిరుచానూరు రైల్వే స్టేషన్ (పద్మావతి రైల్వే స్టేషన్)ను సీఆర్‌ఎస్ వద్ద నిర్మించడానికి రైల్వే అధికారులు అనుమతులిచ్చారు. 2016-17లో రైల్వే బోర్డు ఇక్కడ స్టేషన్ నిర్మించడానికి రూ.32 కోట్లు దశలవారీగా నిధులు విడుదల చేసింది. మూడేళ్ల క్రితం నిర్మాణ పనులు పూర్తి చేస్తామని జీఎం స్థాయి అధికారులు తిరుపతిలో వెల్లడించారు. నేటికీ పనులు పూర్తి చేయకపోవడం గమనార్హం. ఏడాది క్రితమే 60 శాతం పనులను పూర్తి చేశారు. రైళ్ల రాకపోకలకు, స్టేషన్ నిర్వహణకు అవసరమైన అన్ని పనులు పూర్తి చేశారు. రోజు వారీగా రైళ్ల రాకపోకలు కూడా జరుగుతున్నాయి. మిగిలిన 40 శాతం పనులను పూర్తి చేయడానికి శ్రద్ధ చూపకపోవడం శోచనీయం. పెండింగ్‌లో వున్న భవనానికి స్లాబ్ వేశారు. రేకుల షెడ్లు నిర్మించడానికి మాత్రం కాలయాపన జరుగుతోంది. ప్లాట్‌ఫారాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఎస్‌ఎంఆర్ భవనం తూర్పుగా రేకుషెడ్ల నిర్మాణాలు చేపట్టవలసి వుంది. పడమరవైపు రూఫింగ్ పనులు పూర్తి చేయాలి. పనులు పూర్తి చేయకముందే అధికారులు అవసరాల మేరకు వారంపాటు స్టేషన్ నుంచి రైళ్ల రాకపోకలు సాగించారు. అయితే సాధారణ రైల్వే టికెట్ బుకింగ్, ఆర్టీసీ టికెట్ బుకింగ్, తాగునీటి వసతులు ఏర్పాటు చేశారు. వేసవి తాపానికి తల దాచుకోవడానికి మాత్రం రేకుల షెడ్లు పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి తిరుచానూరు రైల్వే స్టేషన్‌లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తల వలసల వెల్లువ

మంగళం, ఏప్రిల్ 24: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని మంగళం, బీటీఆర్ కాలనీ, రణధీరపురం, సప్తగిరికాలనీ, తిరుమలనగర్, బొమ్మలక్వార్టర్స్, హరిపురంకాలనీ ప్రాంతాల్లోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ నేతల తీరుపై అసహనం, ఆగ్రహంతో టీడీపీలోకి వలస బాట పట్టారు. కేవలం రెండు వారాల్లోనే దాదాపు 600మంది వరకు టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇది ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులకు సైతం మింగుడు పడటంలేదు. వైసీపీలోని సామాన్య కార్యకర్తలు, అభిమానులే కాకుండా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు సైతం టీడీపీలో చేరుతుండటం గమనార్హం. ఇలా టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో తిరుమలనగర్ పంచాయతీ నుంచి వైసీపీ వార్డు మెంబర్లు నాగేంద్ర, రమేష్‌తో పాటు దాదాపు 300మంది, రణధీరపురం పంచాయతీ వైసీపీ వార్డు మెంబరు నాగమణితో పాటు 100మంది, మంగళం పంచాయతీలో వైసీపీ వార్డు మెంబర్ మోహన్‌తో పాటు 60మంది సప్తగిరికాలనీ పంచాయతీ నుంచి వైసీపీ నాయకుడు లక్ష్మీరెడ్డితో పాటు 50మంది, బీటీఆర్‌కాలనీలో వైసీపీ నాయకులు వెంకటేష్, మస్తాన్‌లతోపాటు 50మంది, బొమ్మల క్వార్టర్స్‌లో వైసీపీ నాయకుడు సురేష్‌తో పాటు 30మంది, హరిపురంకాలనీలో వైసీపీ నేత పెరుమాల్‌తో పాటు 50మంది టీడీపీలో చేరిపోయారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయంలో కీలకభూమిక పోషించిన నేతలు టీడీపీలోకి వలసబాట పట్టడంతో ఈసారి ఆ పార్టీ విజయం తథ్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జెస్సిక మృతి


జెస్సిక(ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జెస్సిక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణంలోని తూర్పుమొగసాలకు చెందిన ప్రేమ్‌కుమార్, సుభాషిణి దంపతుల కుమార్తె జెస్సిక(7) కిడ్నీ వ్యాధితో కొన్ని రోజులుగా విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటికే లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన ఆ దంపతులు ఇంకా అవసరమైన డబ్బు కోసం దాతల సాయం కోరారు. ఈ క్రమంలో ఆ చిన్నారి మృతిచెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి.

ఏడు అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంట్ స్థానాల్లో

అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నాం

- చంద్రబాబు చరిష్మా, లోకేశ్ పాదయాత్ర, కూటమి కలయికతో గ్రాఫ్ పెరిగింది
- కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన ఆదికేశవుల నాయుడు శ్రద్ధాంజలి సభలో దగ్గుమళ్ల


తేనెబండ వీరబ్రహ్మేంద్రస్వామి కూడలి వద్ద జరిగిన చర్చా వేదికలో ప్రసాదరావు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 24: రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నామని కూటమి చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కూటమి చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నామినేషన్ కార్యక్రమంలో భాగంగా దగ్గుమళ్ల మీడియాతో మాట్లాడారు. ఇప్పటికి ఐదుగురు ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి నామినేషన్ వేశామన్నారు. అన్నిచోట్ల 35 వేల నుంచి 40 వేల మంది వరకు హాజరయ్యారని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తే ఎన్డీయే కూటమికి అత్యధిక మెజారిటీ వస్తుందనే నమ్మకం కలిగిందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు, లోకేశ్ పాదయాత్ర, భువనేశ్వరమ్మ నిజం గెలవాలి యాత్ర ప్రజల్లో టీడీపీ గ్రాఫ్ పెంచిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో కూటమి అభ్యర్థుల గెలుపు నల్లేరు మీద నడకేనన్నారు. ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ గెలిచి, చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. చిత్తూరుకు స్టార్ క్యాంపెయినర్లు ఎవరైనా వస్తున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు నందమూరి బాలకృష్ణ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వస్తున్నారని సమాధానమిచ్చారు. 1981-83లో బాలకృష్ణ తను కలిసి చదువుకున్నామని, ఎన్నికల ప్రచారానికి రావాలని ఆహ్వానించగా ఖచ్చితంగా వస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ గెలుస్తుందని, ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున మెజారిటీ పెంచుకోవడానికి ఉపయోగిస్తామని చెప్పారు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో గెలిచి చరిత్రను తిరగ రాస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. స్టేట్, సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి చిత్తూరును ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, ఏఎస్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాధేయ్

తిరుమల ఘాట్‌లో ముందు వెళుతున్న

డీజల్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఆరుగురికి గాయాలు


డీజల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

తిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):తిరుమల రెండవ ఘాట్‌రోడ్డులో బుధవారం మధ్యాహ్నం ముందు వెళుతున్న డీజల్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆర్టీసీ డిపోకు డీజల్ తీసుకుని ఏపీ 04 టీఎక్స్ 7767 నెంబరు గల ట్యాంకర్ తిరుపతి నుంచి బయలుదేరింది. మార్గమధ్యంలోని లింక్ రోడ్డుకు సమీపంలో వెనుక భక్తులతో వస్తున్న ఏపీ 03 జెడ్ 5591 నెంబరు గల ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా ఢీకొంది. దీంతో బస్సులో ముందు భాగంలో కూర్చుని ఉన్న ఆరుగురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో మహారాష్ట్ర, విజయవాడకు చెందిన వారున్నారు. వీరిని అంబులెన్స్‌లో తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యంఅందించారు. లారీ ఒక్కసారిగా ఆగడంతో ఢీకొన్నట్టు ఆర్టీసీ డ్రైవర్ చెబుతుండగా, రన్నింగ్‌లో ఉన్న తన లారీని వేగంగా ఆర్టీసీ బస్సే వచ్చి ఢీకొందని లారీడ్రైవర్ చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన భక్తులు

గల్లా దంపతులను కలిసిన పులివర్తి నాని


గల్లా దంపతులను కల్సిన నాని దంపతులు

పూతలపట్టు, ఏప్రిల్ 24: చంద్రగిరినియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గల్లా దంపతులను కలిశారు. పేటమిట్టలోని వారి నివాసానికి పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిలు వెళ్లి గురువారం జరగనున్న నామినేషన్ కార్యక్రమానికి రావాలని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా బ్యాటరీస్ సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడులను ఆహ్వానించారు.

విద్యుదాఘాతంతో ప్లాస్టిక్ గోదాము దగ్ధం


మంటలను ఆర్పేందుకు యత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, కాలిపోయిన ప్లాస్టిక్ గోదాము

రేణిగుంట, ఏప్రిల్ 24: విద్యుదాఘాతంతో ప్లాస్టిక్ గోదాము దగ్ధమైన ఘటన రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎర్రంరెడ్డిపాళెంలో ప్లాస్టిక్ స్క్రాప్‌ను కరిగించి చిప్స్‌లా తయారు చేసి ప్లాస్టిక్ వస్తువుల తయారీకి విక్రయించే శ్రీరాధే గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. నిమిషాల వ్యవధితో దావానంలా మంటలు వ్యాపించడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. భారీ ఎత్తున మంటలు వ్యాపించడంతో తిరుపతి, పుత్తూరు నుంచి మరో రెండు ఫైరింజన్లను రప్పించి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేయగా ఫైర్ ఇంజన్లలో నీరు అయిపోయింది. దీంతో ఎదురుగా ఉన్న చెరువులో మోటార్లు ఏర్పాటు చేసి నీటి తోడి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ గోదాము పక్కనే ట్రాన్స్‌ఫారం ఉండటంతో షార్ట్ సర్క్యూట్ జరిగి గోదాముకు నిప్పంటుకుందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.28లక్షలు నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు. అయితే గోదాము గతంలో కూడా భారీ అగ్నిప్రమాదం సంభవించడం గమనార్హం.

కుప్పం ఆర్వో కార్యాలయంపై డ్రోన్ కెమెరా

- యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


కుప్పం ఆర్వో కార్యాలయం ఎదుట డ్రోన్ కెమెరాతో చిత్రీకరిస్తున్న యువకుడు

కుప్పం, ఏప్రిల్ 24: కుప్పం నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయంపై బుధవారం డ్రోన్ కెమెరా ఎగరడం కలకలం సృష్టించింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ ఘటనకు కారకుడైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా కుప్పంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం భరత్ నామినేషన్ వేయడానికి వంద మీటర్ల దూరం నుంచి ఆర్వో కార్యాలయానికి బయలుదేరారు. ఈ దృశ్యాన్ని చిత్రీంచడానికి ఒక యువకుడు ఆర్వో కార్యాలయం ఎదుట డ్రోన్ కెమెరాను ఎగరేశాడు. పరిసరాలను చిత్రీకరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా యువకుడిని అదుపులోకి తీసుకుని, అసిస్టెంట్ ఎన్నికల అధికారి అయిన మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించామని చెప్పారు. యువకుడికి కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.


పోలీసుల అదుపులో యువకుడు

అట్టహాసంగా కిరణ్ నామినేషన్


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 24: రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి బుధవారం నామినేషన్ వేశారు. పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, నల్లారి ఆనంద్‌రెడ్డి, అడ్వకేట్ అమరనాథరెడ్డిలతో కలసి వెళ్లి అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కిషోర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం రాజంపేట పార్లమెంటు పరిధిలోని బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులతో కలసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఇంతియాజ్ అహ్మద్, పర్విన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆటో డ్రైవర్లకు రెండ్రోజుల జైలు శిక్ష

● 13 మందికి రూ.10వేల వంతున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24: అధిక మోతాదులో మద్యం తాగి ఆటో నడిపి ప్రయాణికులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఇద్దరు ఆటో డ్రైవర్లకు రెండ్రోజుల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు మొదటి తరగతి న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం మండలం బెస్తపల్లికి చెందిన దామోదరం, చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరుకు చెందిన గిరిబాబులు మద్యం తాగి ఆటోనడపగా ట్రాఫిక్ అంతరాయం కల్గించారు. దాంతో వీరికి జైలు శిక్ష విధించారు. మరో 13 మంది మద్యం తాగి వాహనాలు నడపడంతో ఒక్కొక్కరికి రూ.10,000 వంతున రూ.1,30,000 జరిమానా విధించారు. ఇదిలావుండగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ రోడ్లపై విచ్చలవిడిగా గంపలు, బుట్టలు, తోపుడు బండ్లు పెట్టుకుని వున్న 127 మందికి ఒక్కొక్కరికీ రూ.200 చొప్పున అపరాధ రుసుం విధించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్, సీఐలు, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ అభినందించారు.

ల్యాబ్ పరిసరాల్లో మూత్రపు సీసాల తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 24: రుయాస్పత్రిలోని రక్తపరీక్షల కేంద్రం పరిసరాల్లో దుర్గంధభరితంగా పడేసివున్న మూత్రపు సీసాలను ఎట్టకేలకు తొలగించారు. రక్తపరీక్షల కేంద్రం చుట్టూ మూత్రపు సీసాలను విచ్చలవిడిగా పడేసివున్న విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'రుయాలో దుర్గంధభరితంగా రక్తపరీక్షల కేంద్రం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన రుయా సూపరింటెండెంట్ రవిప్రభు మంగళ, బుధవారాల్లో ల్యాబ్ చుట్టూ ఉన్న మూత్రపు సీసాలను తొలగించడంతోపాటు ల్యాబ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ల్యాబ్‌కు వచ్చే రోగులకు సైతం అవగాహన కల్పించి మూత్రపు సీసాలను దూర ప్రాంతాల్లోని చెత్త కుండీల్లో వేసేలా సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు: బీజేపీ



మీడియాతో మాట్లాడుతున్న సామంచి

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 24: ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు అందించడమే పీఎం నరేంద్రమోదీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థిక రంగాన్ని కాపాడుతూ మోదీ మూడోసారి అధికారంలోకి రానున్నారన్నారు. దీనిని ఓర్వలేని కాంగ్రెస్ నేతలు బ్రిటీష్ పాలనను అనుసరిస్తూ దేశాన్ని విభజించి పాలించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు.

ఎన్నికలపై సందేహాలను నివృత్తి చేస్తా

● పోలీసు అబ్జర్వర్ అరవింద్ సాల్వే



అరవింద్ సాల్వేకు పుష్పగుచ్ఛమిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24: తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల అధికారులకు ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవచ్చని.. అందరికీ అందుబాటులో ఉంటానని పోలీసు అబ్జర్వర్ అరవింద్ సాల్వే అన్నారు. రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక పోలీసు అతిథి గృహం వద్ద ఉంటానన్నారు. ప్రజలకు ఎటువంటి సందేహాలున్నా పోలీసు పరిశీలకులను కలసి నివృత్తి చేసుకోవచ్చని విజ్ఞప్తి చేశారు. అత్యవసర సమయాల్లో సెల్ నెంబరు 91541 41876ను సంప్రదించవచ్చన్నారు. సాల్వేకు బుధవారం పుష్పగుచ్ఛమిచ్చి ఎస్పీ కృష్ణకాంత్ స్వాగతం పలికారు.

పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులు వినియోగించుకోండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఏపీ ఎన్జీవో సంఘం తిరుపతి అధ్యక్షుడు ఎస్.సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీ శుక్రవారం నాటికి ఫారం 12 సమర్పించడానికి ఆఖరు రోజని తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే వారందరూ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్లు వేయడానికి వీలుగా ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లు, పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అన్ని నియోజకవర్గ ఆర్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. మే 5న పోస్టల్ బ్యాలెట్‌కు హాజరయ్యేందుకు ఉద్యోగులకు ప్రభుత్వం క్యాజువల్ లీవ్‌ను ప్రకటించాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.09 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.09 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ప్రకటించింది. మంగళవారం 60,371 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,301 మంది తలనీలాలు సమర్పించారు.

మంత్రిగారి పీఏనా మజాకా!

● విద్యుత్ కనెక్షన్ కోసం అనుమతుల్లేకుండా తవ్వేసిన రోడ్డు

● ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో రాత్రికి రాత్రే పూడ్చివేత



తవ్విన రోడ్డును పూడ్చిన దృశ్యం



తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆయన ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ కీలక మంత్రి దగ్గర వ్యక్తిగత సహాయకుడు (పీఏ). అతడి అల్లుడు లీలామహల్ నుంచి మంగళం రోడ్డులో కొత్తగా లాడ్జి నిర్మించాడు. హైటెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్ కనెక్షన్ లాడ్జికి అవసరమైంది. టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రోడ్డు తవ్వేందుకు అనుమతులు తీసుకుని ఎస్పీడీసీఎల్ అధికారులు ఓవర్ హెడ్ మీద ఏర్పాటుచేయవచ్చు. కానీ అక్కడ అమాత్యుల దగ్గర ఉండే వ్యక్తి కదా! ఒక్క ఫోన్ కాల్ చాలు. దగ్గరుండి మరీ పనులు చక్కబెట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్మార్ట్‌సిటీ నిధులతో ఇటీవల వేసిన ఫుట్‌పాత్‌ను పగలగొట్టేశారు. టీటీడీ పర్యవేక్షణలో ఉండే రోడ్డును తవ్వేశారు. అమెరికన్ బార్ దగ్గర నుంచి లాడ్జి ఉండే దాదాపు 300 మీటర్ల వరకు రోడ్డును తవ్వి కనెక్షన్ ఇచ్చారు. ఇదిగమనించిన కొందరు సీవిజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. తేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు రాత్రికి రాత్రే గుంతలు పూడ్చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు కూడా ఎస్పీడీసీఎల్ అధికారులు ఇలా ఏకపక్షంగా వ్యవహరించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

టీడీపీ నాయకులపైనే బైండోవర్ కేసులా..?

పోలీసుల తీరుపై టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడి మండిపాటు



తహసీల్దార్ కార్యాలయం వద్ద హేమంత్ రాయల్‌ను బైండోవర్ చేసుకుంటున్న పోలీసు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులపైన మాత్రమే బైండోవర్ కేసులు పెట్టడం మంచిది కాదని పోలీసుల తీరుపై టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హేమంత్ రాయల్ మండిపడ్డారు. బుధవారం హేమంత్‌రాయల్‌పై బైండోవర్ కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడితే కేసులు పెట్టి, బైండోవర్ చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. తిరుపతిలో రౌడీయిజం చేసిన, భూదందాలకు పాల్పడిన, గంజాయి వంటి మత్తు పదార్థాలు సరఫరా చేసిన వారిపై ఎలాంటి కేసులు పెట్టకపోవడం పోలీసుల పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పోలీసులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఏ వ్యాపారం చేసి ఆస్తులు కూడబెట్టారో తండ్రీకొడుకులు చెప్పాలి

● ఈసారి గెలిస్తే తిరుపతిని స్వాహా చేస్తారు

● జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



గాజు గ్లాసుకు ఓటు వేయాలని కోరుతున్న నాయకులు

తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏ వ్యాపారం చేసి ఆస్తులు కూడబెట్టారో తండ్రీకొడుకులు చెప్పాలని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈసారి కూడా గెలిస్తే తిరుపతిని స్వాహా చేస్తారని ఆరోపించారు. పదవులు అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆస్తులు కూడబెట్టారని తాము చేసిన ఆరోపణలను అభినయ్ రెడ్డి ఎన్నికల అఫిడవిట్ నిర్ధారించిందని స్పష్టం చేశారు. టీటీడీ ఉద్యోగులకు పాదిరేడు వద్ద ఇంటి స్థలాల కేటాయింపు వెనుక అభినయ్ రెడ్డి భూములకు రేటు పెంచుకోవడమే తప్ప మరొకటి కాదని అఫిడవిట్ నిరూపించిందన్నారు. ఆరణి బుధవారం 26, 11, 27, 32 డివిజన్లలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పులుగోరు మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎస్కేడీ నగర్‌లో మోహన్, అతని బంధువులు, స్నేహితులు 30మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. ట్రావెల్స్ ఆఫీసులో జెరాక్స్ షాపు నిర్వహించిన కరుణాకర రెడ్డి.. తుడాకు, టీటీడీకి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కుమారుడి పేరిట ఇబ్బడిముబ్బడిగా ఆస్తులను కొనుగోలు చేసే పరిస్థితి ఎలా వచ్చిందనే రహస్యం ప్రజలకు చెబితే అందరూ అలానే చేస్తారన్నారు. అభినయ్ రెడ్డి పదహారేళ్ల వయసులో కోట్లాది రూపాయల ఆస్తులు కొనడం.. వింతల్లో వింత అని విమర్శించారు. తండ్రీకొడుకుల బాగోతం బయటపడగానే టీటీడీ ఉద్యోగుల సంక్షేమాన్ని ఎన్డీయే కూటమి అడ్డుకుంటోందన్న అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు జేబీ శ్రీనివాస్, హేమంత్ యాదవ్, కంకణాల రజినీకాంత్, గెంజి సుధాకర్ రెడ్డి, అన్నా రామచంద్రయ్య, మునిరామయ్య, భారతి, పవన్, నాగప్రతాప్, మునిరాజా, దేవ, ఢిల్లీ బాబు, చినబాబు, జనసేన నాయకులు హరి ప్రసాద్, కిరణ్ రాయల్, బండ్ల లక్ష్మీపతిరాయల్, సామంచి శ్రీనివాసులు, మహబూబ్ బాషా, బబ్బులు, జలపోతు చంద్ర రెడ్డి, ఎస్కేడీ నగర్ విజయ్, శంకర్‌లు పాల్గొన్నారు. కాగా, 47వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి సుబ్రమణ్యం నాయుడు దాదాపు 200 అనుచరులతో పార్టీలో చేరారు.



వైసీపీ కార్యకర్తను జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఆరణి శ్రీనివాసులు

వైసీపీని ఇంటికి పంపడానికి కృషి చేస్తాం

● మాదిగల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు



మీడియాతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు మాదిగ

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 24: 'వైసీపీ పాలనలో కోటి మంది మాదిగ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయారు. మాదిగల హక్కుల సాధన కోసం కూటమి పార్టీలకే 35 ఉపకులాల మద్దతు ఇచ్చి వైసీపీని ఇంటికి పంపే విధంగా కృషి చేస్తాం' అని మాదిగల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏపీఎంఆర్‌పీఎస్ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎస్సీలకు చెందిన 27 పథకాలను సీఎం జగన్ రద్దు చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక మాదిగలను పూర్తిగా అణచివేశారని విమర్శించారు. మాదిగల హక్కులు తిరిగి పొందాలన్నా, ఎస్సీ వర్గీకరణ సాధించాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. మాదిగలంతా ఏకమై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఆర్‌పీఎస్ నేతలు ఆర్.జే.ప్రకాశ్, పొన్నగంటి రమేష్, బెంజిమెన్, సుబ్బయ్య, సుబ్బారావు, నాగేశ్వరావు, రాఘవ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని కోరుకున్నా

● రఘురామకృష్ణమరాజు



రఘురామకృష్ణమరాజుకు శ్రీవారి జ్ఞాపిక అందజేసిన టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, ఇందుశేఖర్

తిరుమల,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తిరుమల వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్టు నరసాపురం ఎంపీ, ఉండి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి రఘురామ కృష్ణమరాజు తెలిపారు.బుధవారం ఉదయం అర్చన సేవలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నుంచి ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నామినేషన్ వేసిన అనంతరం స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. రాష్ట్ర ప్రజలు కష్టాల నుంచి బయటపడాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. ఇక సీఎం జగన్మోహన్‌రెడ్డిపై గులకరాయి దాడి నిజంగా జరిగివుంటే మంచి పరిణామం కాదన్నారు. అయితే అదో అభూత కల్పన మాత్రమే అన్నారు. దానిగురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఈ విషయం గురించి ప్రజలు కూడా నవ్వుకుంటున్నారన్నారు.

ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష దరఖాస్తుకు 30 వరకు గడువు పెంపు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 24: ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గడువు తేదీని పొడిగించినట్టు ఇంటర్మీడియట్ విద్యామండలి తిరుపతి ప్రాంతీయాధికారి (ఆర్ఐవో) ప్రభాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇదివరకు ఇంటర్ బోర్డు ప్రకటించిన మేరకు... అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీతో గడువు ముగిసింది. విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 30వ తేదీ వరకు గడువును పొడిగిస్తూ ఇంటర్ విద్యామండలి నిర్ణయించిందని వెల్లడించారు. అలాగే జవాబు పత్రాల రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ దరఖాస్తుకు కూడా ఈనెల 30వ తేదీ వరకు గడువును పెంచారన్నారు.

ఎన్డీఏ అధికారంలోకి రావడం ఖాయం: వరప్రసాదరావు





టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలులో వరప్రసాద్ - వరప్రసాదరావుకు బీజేపీ నాయకుల సత్కారం

వెంకటాచలం / గూడూరు, ఏప్రిల్ 24: అడ్డంగా దోచేసిన డబ్బులను అధికారపార్టీ నాయకులు వెదజల్లినా వారికి ఓటమి తప్పదని ఎన్డీఏ కూటమి విజయం తథ్యమని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం తిరుపతి లోక్‌సభ పరిధిలోని సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో వరప్రసాద రావు పాల్గొన్నారు. ముందుగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ నిర్వహించారు. వెంకటాచలంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు. అనంతరం కార్యాలయం వెలుపల వరప్రసాద రావు మాట్లాడుతూ... ఓటమి తప్పదని గ్రహించిన వైసీపీ నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు, రకరకాల ప్రలోభాలకు తెరదీస్తున్నారన్నారు. అందులో భాగంగానే సర్వేపల్లి నియోజకవర్గంలో విచ్చలవిడిగా మద్యాన్ని డంప్ చేసి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోతున్నారని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, అమీర్ బాషా తదితరులు ఉన్నారు.

ఎన్డీఏ హామీలను ప్రజలకు తెలియపరచాలి

ఎన్డీఏ మిత్రపక్షాలు ఇచ్చిన హామీలను ప్రజలకు తెలియపరచి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసేలా కృషి చేయాలని వెలగపల్లి వరప్రసాదరావు దిశానిర్దేశం చేశారు. గూడూరులో తనను మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులకు... గూడూరు నియోజకవర్గంలో తానుచేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. కూటమి గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుషోత్తమరెడ్డి, చిల్లకూరు జడ్పీటీసీ సభ్యుడు మన్యం శ్రీనివాసులు, వరగలి ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, పరమేష్, తిప్పనూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన జనసేన నాయకుడు హరిబాబును కలుసుకొని మద్దతు కోరారు. చెన్నూరుకు చెందిన టీడీపీ నాయకుడు టి.రాఘవరెడ్డితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

రేపు తిరుపతికి ఉపరాష్ట్రపతి రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24: భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ శుక్రవారం తిరుమలకు విచ్చేస్తున్నారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఉదయం 10.30గంటలకు ఉపరాష్ట్రపతి తిరుపతి విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. దర్శనానంతరం బయల్దేరి మధ్యాహ్నం ఒంటి గంటకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే మూడో స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని తిరుగు ప్రయాణం కానున్నారని వివరించారు. ఈ పర్యటన నేపథ్యంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయం చేరుకుని, రాత్రికి తిరుపతిలో బస చేస్తారన్నారు. అలాగే శుక్రవారం ఉపరాష్ట్రపతికి విమానాశ్రయంలో స్వాగతం పలికాక ఉదయం 11.10 గంటలకు బర్డ్ ఆస్పత్రి, శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌ని గవర్నర్ సందర్శిస్తారన్నారు. ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలికాక విజయవాడకు బయల్దేరుతారని కలెక్టర్ తెలియజేశారు. అందువల్ల ఏర్పాట్లకు సంబంధించిన విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. బందోబస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండొద్దని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఆర్వో పెంచలకిషోర్, ఏఎస్పీ కులశేఖర్, రుయా అధికారులు, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, డీఈవో శేఖర్, విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా రుయాలో ఆడిట్

సూపరింటెండెంట్ రవిప్రభు

తిరుపతిరు(వైద్యం), ఏప్రిల్ 24:రుయాస్పత్రిలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఐదేళ్ల తరువాత జరుగుతున్న ఆడిట్ ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిష్పక్షపాతంగా జరుగుతుందని రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018-19నుంచి 2023-24వరకు రుయాస్పత్రిలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జరుగుతున్న ఆడిట్‌లో అనేక అక్రమాలను ఆడిట్ అధికారులు గుర్తించారనే విషయంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో పక్కదారి పట్టిన రూ.20కోట్లు అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన సూపరింటెండెంట్ రవిప్రభు మాట్లాడుతూ ఆడిట్ ఇంకా పూర్తి కాలేదని ఆడిట్‌కు సంబంధిచి ఇప్పటి వరకు ఎలాంటి నివేదికలను కూడా ఆడిట్ అధికారులు సమర్పించలేదన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉంటారని దీంతో అభివృద్ధి నిధుల్లో నుంచి రూ.లక్షలకుపైగా డ్రా చేయాలంటే తప్పక ఆయన అనుమతి అవసరమన్నారు. అలాగే ఇప్పటివరకు జరిగిన ఆడిట్‌కు సంబంధించి అన్నీ రికార్డులను ఆడిట్ అధికారులకు అందజేశామని ఇందులో రికార్డులను తారుమారు చేసే అవకాశం లేదన్నారు. ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయని దీంతో అవినీతికి తావుండే అవకాశం ఉండదని ఆయన తెలిపారు. ఖరీదైన పరికరాలన్నీ టెండర్ ప్రాతిపాదికన కొనుగోలు చేస్తామని ఇందులో సిబ్బంది పాత్ర ఉండదన్నారు. ఏది ఏమైనా ఆడిట్ పూర్తయ్యి ఆడిట్ అధికారులు నివేదికలు ఇచ్చే వరకు ముందస్తుగా ఎలాంటి అవినీతిని గుర్తించలేమని ఆయన పేర్కొన్నారు. ఆడిట్‌లో ఎవరైనా సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు తేలితే తప్పక శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

చంద్రబాబు మెగా డీఎస్సీ ప్రకటన హర్షణీయం

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు ● టీడీపీ అధినేత చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు యువత

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పడం హర్షణీయమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు అన్నారు. ఈ మేరకు ఎయిర్‌బైపాస్‌రోడ్డులో బుధవారం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. థాంక్యూ చంద్రబాబు అంటూ విద్యార్థులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శించారు. ఈసందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని యువత అంతా కూడా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటామని ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే 25వేల డీఎస్సీ పోస్టులను భర్తీ చేస్తామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని తదితర హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. పవన్ కల్యాణ్ కలయికతో కూటమికి మరింత బలం చేకూరిందని, రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిపాటి వివేక్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి తోట వాసు, కరణం సందీప్, రఫీ, శ్రీనివాస్‌యాదవ్, శ్రీరామ్‌బాబి, సంతోష్‌రాయల్, లోకేష్, గోపి, గణేష్, శివ, డీఎస్సీ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ప్రసాద్, పెద్దఎత్తున యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రశాంతంగా ఉండాలంటే వైసీపీ ఓడాలి

● టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ



తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రశాంతంగా ఉండాలంటే వైసీపీని ఓడించి.. ఎన్డీయే కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని 35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ పిలుపునిచ్చారు. ఆరణి కుమార్తె శ్రావణితో కలసి బుధవారం స్థానిక కేటీ క్వార్టర్స్, భవానీనగర్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, యూనిట్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, సమన్వయకర్త తమ్మినేని వెంకటేశ్వర్లు, బై అండ్ సేవ్ మధు, సురేష్, సుజాతమ్మ, దర్శన్, ఆర్సీ కుమార్, మునిదేవరాజులు, శ్రీకాంత్, నాగవేణి, ఇందిర, మునెమ్మ, శ్యామలమ్మ, రేవతితో పాటు బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో కర్ణాటకవాసి అదృశ్యం



బసవరాజప్ప

తిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కర్ణాటకవాసి అదృశ్యమయ్యాడు. చిత్రదుర్గాకు చెందిన బసవరాజప్ప(50) దాదాపు 40 మంది భక్తులతో కలిసి ఈనెల 15వ తేదీన తిరుమలకు వచ్చాడు. 16వ తేదీ రాత్రి 8.30 గంటలకు శ్రీవారి దర్శనం ముగించుకున్నాక రాంభగీచ బస్టాండ్ వద్దకొచ్చేసరికి కనిపించకుండా పోయాడు. ఆయన కుమారుడు గిరియప్ప మంగళవారం తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 94407 96772 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు బుధవారం ఓ ప్రకటన ద్వారా కోరారు.

రేపు విశ్వంలో పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 24: పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్‌ను వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో శుక్రవారం ఉచితంగా నిర్వహించనున్నట్టు అధినేత ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆ రోజున ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుందని, విద్యార్థులు పాలిసెట్ హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతో పరీక్షకు నేరుగా హాజరుకావొచ్చని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నెంబర్లలో సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఇదీ మందు

బాబ్బాబు.. ఈసారి మీరడిగిందిస్తా!

తప్పు జరిగిపోయిందబ్బా... ఈదఫా మీరు ఏది చెబితే అది చేస్తాను..? ఎవరు ఏమిటన్నది తెలుసుకున్నాను. మళ్లీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తాను... చంద్రగిరి నియోజకవర్గంలో రోజురోజుకూ చేజారిపోతున్న స్వపక్షీయులకు వైసీపీ నాయకుడు బుజ్జగిస్తూ చెబుతున్న మాటలివి.. గతఎన్నికల్లో తిరుపతి రూరల్ మండలంలో వైసీపీ విజయానికి చొక్కాలు చింపుకుని పనిచేసిన పలువురు కీలకనేతలు ఇప్పుడు ఒక్కరొక్కరుగా పార్టీని వీడుతున్నారు. టీడీపీ కండువా కప్పుకుంటున్నారు. మొదట మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన నేతలు ఇప్పుడు డ్యామేజిని గుర్తించారు. దీంతో సీరియస్‌గా మధ్యవర్తిత్వ రాజకీయానికి తెరలేపారు. అనుచరులను రంగంలోకి దింపి బుజ్జగింపులు ప్రారంభించారు. వీరు ద్వితీయ శ్రేణి నేతల ఇళ్లకు వెళ్లి బతిమలాడుతున్నారని తెలిసింది. కొందరు బైపాస్ రోడ్డులోని కేఫ్‌లు, రెస్టారెంట్ల వేదికగా మంతనాలు సాగిస్తున్నారు. ఈదశలో పార్టీ మారకుండా కట్టడి చేయడం కష్టమని.. తమచేతుల్లో ఏమీలేదని ద్వితీయశ్రేణి నేతలు బదులిచ్చేసరికి మధ్యవర్తులు బిక్కముఖం వేస్తున్నారు. రెండ్రోజుల కితం ఒకే సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు నేతలతో కమిటీని వేసి పంచాయతీల వారీగా బాధ్యతలు అప్పగించారని తెలిసింది. మళ్లీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తానని ప్రాధేయపడినా నేతలు మాత్రం బయటకు వచ్చి మనపని మనం చేసుకుపోదామని చర్చించుకున్నారని తెలిసింది.

- తిరుపతి రూరల్



తగ్గేదే..లే..

'వాళ్లు ఐదేళ్లు మన పొట్టమీద కొట్టారు.. మనం ఈసారి ఓటుతో వాళ్ల మూలాలనే దెబ్బతీద్దాం' అని కూడబలుక్కున్నారు చిల్లకూరు మండలంలోని సిలికా మైన్ల యజమానులు. కోట, చిల్లకూరు మండలాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో 77 సిలికా మైన్లు ఉన్నాయి. ఇవన్నీ స్థానిక చోటా, బడా నేతల ఆధీనంలోనే ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక తీరు మారిపోయింది. సిండికేట్ ఏర్పాటుచేసి అందులో చేరాలంటూ స్థానిక యజమానులను ఆదేశించారు. వారు అంగీకరించకపోవడంతో నేరుగా అధికారపార్టీ నాయకులే రంగంలోకి దిగి మైన్లు లాగేసుకున్నారు. దీంతో స్థానిక యజమానులంతా కుదేలయ్యారు. ఆర్థికంగా చిక్కిపోయారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీకి సహకరించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. గ్రహించిన వైసీపీ నేతలు మళ్లీ రంగంలోకి దిగారు. రాయలసీమకు చెందిన మంత్రి తిరుపతికి వీరందరినీ పిలిపించుకొని మాట్లాడినట్టు చెబుతున్నారు. గెలిచాక మైన్లు మీకే అప్పగిస్తామంటూ నమ్మబలికారు. నిన్నటిదాకా తమ బతుకులను అతలాకుతలం చేసిన వైసీపీ నేతల మాయమాటలను వీరు విశ్వసించేలా లేరు. వెనక్కు తగ్గబోమని అంతర్గతంగా చర్చించుకుంటున్నారని సమాచారం.

-కోట

జన కేతనం



కాళంగి నది

రైతుల ఆశలకు జగన్ సర్కార్ 'చెక్'

- టీడీపీ ప్రభుత్వంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదన
- ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకోని నాయకులు

మా వైసీపీ అధికారంలోకి రాగానే కాళంగి నదిపై నాలుగు చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తాం...

2019 ఎన్నికల వేళ వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజలకిచ్చిన హామీ ఇది. ఆయన గెలిచారు. వైసీపీ ప్రభుత్వమూ ఏర్పడింది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాల హామీని మాత్రం విస్మరించారు.

జిల్లాలో ఏడు మండలాల్లో సుమారు లక్ష ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షకంగా సాగు నీరందించే కాళంగి నదిపై చెక్ డ్యాముల ఏర్పాటు కలగానే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపించింది. ఏటా వర్షాకాలంలో వృధాగా పోతున్న లక్ష క్యూసెక్కుల వరద నీటి నిల్వకు చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు చేయిస్తానన్న ఎమ్మెల్యే సంజీవయ్య మాట నిలబెటుకోలేదు. చెక్ డ్యాములు నిర్మిస్తారని ఐదేళ్లూ నిరీక్షించి రైతులు నీరసపడ్డారు. పిచ్చాటూరు మండలం ఆరణియార్‌కు పశ్చిమంగా ఉన్న నగరి కొండల్లో చిన్న కాలువగా పుట్టి, పిచ్చాటూరుతో పాటు, కేశబీపురం, తొట్టంబేడు, బుచ్చినాయడుకండ్రిగ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల మీదుగా ప్రవహించి పులికాట్ సరస్సులో కలిస్తుంది కాళంగి నది. వర్షాకాలంలో లక్షలాది కొద్దీ క్యూసెక్కుల వరద నీటితో జలకళ ఉట్టిపడుతుంది. తర్వాత వరద నీరు పులికాట్ సరస్సులో కలిసిపోతోంది.

- దొరవారిసత్రం


టీడీపీ ప్రభుత్వంలో కొంత కదలిక

వర్షపు నీటిని దిగువ ప్రాంతంలో నిల్వ చేయగలిగితే లక్ష ఎకరాలకు సాగు నీరందుతుందని ఇరిగేషన్‌శాఖ అధికారులు లెక్కలేశారు. రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలో నీరు వినియోగించుకోవచ్చు. నది పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. వ్యవసాయ బోర్ల ద్వార రెండు పంటలను పండించుకునే అవకాశం ఉంటుంది. అందుకే 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.56 కోట్లతో నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి తొలి అడుగు వేసింది. నిధుల మంజూరుకు సుముఖత చూపింది. టెక్నికల్ అంచనాలు సరిచేసే ప్రక్రియలో కొంత ఆలస్యమైంది. ఈలోగా ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఆ ప్రతిపాదనలను అటకెక్కించింది. అన్నదాతల కోరిక నెరవేరలేదు.



తనియాలి వద్ద కాళంగిపై పురాతన ఆనకట్ట

ఆ రోడ్డేది మధుసూదా...



స్వర్ణముఖి నది ఒడ్డున కనకాచలం కింద రోడ్డు ప్రతిపాదించిన స్థలం


అదిగో శివం టు శివం రోడ్డు.. ఇవిగో పనులంటూ ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అరచేతిలో వైకుంఠం చూపించారు. శ్రీకాళహస్తికి మహర్దశ వచ్చేసిందంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ఒక్క అడుగూ ముందుకు పడకుండానే ఐదేళ్లూ గడిపేశారు. పూతలపట్టు-నాయుడుపేట రహదారి బైపాస్ వంతెన నుంచి ముక్కంటి ఆలయం వరకు శివం టు శివం రోడ్డును గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. స్వర్ణముఖి నది ఒడ్డున కనకదుర్గమ్మ వెలసిన కనకాచలం కొండకు ఆనుకుని రామసేతు వంతెన నుంచి రోడ్డు సాగాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి బైపాస్ వంతెన వద్ద అర్ధనారీశ్వర స్వామి ఆలయం నుంచి ముక్కంటి ఆలయం వరకు రూ.20 కోట్ల నిధులతో శివం టు శివం రోడ్డు నిర్మించేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. ఆచరణదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయించలేకపోయారు. రోడ్డు నిర్మించాల్సిన మార్గంలో స్వర్ణముఖి నది కరకట్ట అలాగే దర్శనమిస్తుంది. కనకాచలం కొండ వద్ద పాత పరిస్థితి కూడా ఏమాత్రం మారలేదు. శివం టు శివం రోడ్డు ఎక్కడైనా కనబడిందా... ఎవరైనా చూశారా అంటూ ఇక్కడి ప్రజలు చలోక్తులు విసురుతున్నారు.

- శ్రీకాళహస్తి

జనం చెవిలో జగన్ పూలు

- అధినేత బాటలో వైసీపీ తమ్ముళ్లు

గత ఎన్నికల్లో అధికారం కోసం జగన్ ఎడాపెడా హామీలు గుప్పించారు. సాధ్యాసాధ్యాలను పట్టించుకోకుండా అన్ని వర్గాలకూ మాటిచ్చేశారు. మాట తప్పను - మడం తిప్పను అంటూ ప్రగల్బాలు పలికారు. సీఎం గద్దెనెక్కాక తానిచ్చిన హామీలను గాలికొదిలేశారు. అధినేత బాటనే వైసీపీ నాయకులూ అనుసరించారు. తమ నియోజకవర్గాల్లో హామీలిచ్చేశారు. అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా జనం చెవిలో పువ్వు పెట్టారు. ఆ కోవలోకి వచ్చే హామీలను మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...





కొండెక్కిన జగన్ హామీ

- ప్రత్యామ్నాయం చూపకుండా తిరుమల స్థానికులకు మొండిచేయి



విస్తరణ అనంతరం తిరుమల శ్రీవారి ఆలయం మాడవీధులు

'తిరుమల మాడవీధుల విస్తరణలో దుకాణాలు కోల్పోయిన 186 మంది వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా దుకాణాలు కేటాయిస్తాం'

- గత ఎన్నికల సమయంలో జగన్ తిరుమల స్థానికులకు ఇచ్చిన హామీ ఇది.

జగన్ హామీలను నమ్మి మోసపోయిన వారిలో శ్రీవేంకటేశ్వరస్వామిని పాదాల దగ్గర నివసించే తిరుమల స్థానికులు కూడా ఉన్నారు. శ్రీవారి ఉత్సవ మూర్తులను ఊరేగించేందుకు, తిరుమల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు టీటీడీ దశల వారీగా ఆలయ మాడవీధులను అభివృద్ధి చేసింది. 1998 నుంచి 2018 వరకు ఆలయానికి ఆనుకుని ఉన్న కట్టడాలు, చెట్లు, బండరాళ్లు తొలగించారు. 2001-04 మధ్య ఆలయం చుట్టూ ఉన్న ఇళ్లు, దుకాణాలు, మఠాలు, చిన్నచిన్న ఆలయాలను తొలగించారు. ఇళ్లు, దుకాణాలు తొలగించిన క్రమంలో తిరుమల స్థానికులు, టీటీడీ అధికారుల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. జీవనాధారంతో పాటు ఇళ్లు కూడా లాగేసుకుంటే ఎక్కడ నివసించాలంటూ స్థానికులు తిరగబడ్డారు. దీంతో ప్రత్యామ్నాయంగా దుకాణాలను కేటాయిస్తామని చెప్పడంతో స్థానికులు చల్లబడ్డారు. దశలవారీగా కొందరికి ఇళ్లు, మరికొందరికి దుకాణాలు కేటాయించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములున్న వారు రెండు దుకాణాలు కేటాయించాలని పట్టుబట్టి ప్రత్యామ్నాయం పొందలేకపోయారు. కుటుంబంలో ఒకరు దుకాణాన్ని పొందాక, అదే కుటుంబానికి చెందిన మరొకరు కూడా న్యాయం చేయాలంటూ టీటీడీపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇలా కొన్నేళ్లుగా తిరుమల స్థానికులు టీటీడీ చుట్టూ తిరుగుతూ వచ్చారు. ప్రతి కుటుంబానికీ ప్రత్యామ్నాయంగా ఇళ్లు, దుకాణాలు కేటాయించామని, ఇక ఈకేటగిరీలో ఎవరికి ఎలాంటి ఇవ్వాల్సిన అవసరం లేదంటూ టీటీడీ బోర్డు తీర్మానం చేసింది. తిరుమల స్థానికులు మాత్రం 186 మందికి దుకాణాలు రావాల్సి ఉందని పోరాటాలు చేశారు. ఈక్రమంలోనే గత ఎన్నికల సమయంలో జగన్ 186 మందికి ప్రత్యామ్నాయంగా దుకాణాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తిరుమల స్థానికులు జగన్ మాటల మాయలో పడ్డారు. సమస్య తీరిపోతుందని నమ్మారు. కానీ వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

- తిరుమల

సత్యవేడు వర్తమానం



ఆదిమూలం

నియోజకవర్గంలో స్థానికేతర అంశం అధికార వైసీపీని ముచ్చెమటలు పట్టిస్తోంది. స్థానికులకే టికెట్ ఇవ్వాలని పెరిగిన డిమాండ్, ఇరవై రోజుల వ్యవధిలో రెండుసార్లు అభ్యర్థుల మార్పు, కేడర్ అభిప్రాయాలను పట్టించుకోకుండా అభ్యర్థిని ప్రకటించడం లాంటి అంశాలతో ఆ పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఫలితంగా వైసీపీ కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది.

- సత్యవేడు

ఫ్యానుకు లోకల్ స్ట్రోక్

- సత్యవేడు వైసీపీ ఉక్కిరిబిక్కిరి
- స్థానిక అంశంతో కేడర్‌లో అసంతృప్తి
- దళితుల్లో ఆదిమూలంపై పెరిగిన సానుభూతి
- అభ్యర్థి రాజకీయానుభవంతో టీడీపీలో జోష్

సత్యవేడు ఎన్నికల బరిలో వైసీపీ ఎదురీదుతోంది. ఇక్కడ ఆ పార్టీ తరఫున 2019 ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే ఆదిమూలం పార్టీని వీడి అనూహ్యంగా టీడీపీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత జనవరిలో వైసీపీ విడుదల చేసిన మూడవ జాబితాలో ఆదిమూలంను తిరుపతి ఎంపీ అభ్యర్థిగా, తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. ఎంపీగా వెళ్ళేందుకు ఇష్టంలేని ఆదిమూలం తిరస్కరించారు. ఎమ్మెల్యే స్థానం నుంచి తప్పించి, ఎంపీగా కూడా టికెట్ లేకుండా చేయాలని పెద్దిరెడ్డి కుట్రపన్నారని ఆదిమూలం గట్టిగా గళం విప్పారు. పెద్దిరెడ్డిపై ఆయన ఆరోపణలు సంధిస్తూ ధిక్కారస్వరం వినిపించడం రాష్ట్రంలో పెను ప్రకంపనలు సృష్టించాయి. దీంతో ఆదిమూలంను సస్పెండ్ చేసేందుకు పార్టీ నిర్ణయం తీసుకుంటున్న తరుణంలో ఆయన టీడీపీతో టచ్‌లోకి వెళ్ళారు. ఈ పరిణామంతో వైసీపీ కంగు తింది. తిరుపతి ఎంపీ స్థానానికి సరైన అభ్యర్థి దొరక్క గురుమూర్తినే మళ్ళీ ఎంపీ అభ్యర్థిగా, మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్‌ను సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది.

నివురుగప్పిన నిప్పులా అసంతృప్తి

రాజేష్ స్థానికేతరుడు కావడం, స్థానిక సమస్యల పట్ల అవగాహన లేకపోవడం, పట్టుమని నలుగురు నాయకుల పేర్లు కూడా సరిగ్గా చెప్పలేని స్థితిలో ఉండడంతో నియోజకవర్గంలో వైసీపీ నుంచే నిరసన సెగలు తగిలాయి. కనీస పరిచయం లేని వారికి టికెట్ ఇస్తే పనిచేసేది లేదని, స్థానికులకే టికెట్ ఇవ్వాలని కేడర్ బహిరంగంగా డిమాండ్ చేస్తూ వచ్చారు. ఓ దశలో అభ్యర్థి మార్పు తప్పదన్న ప్రచారం కూడా జరిగింది. ఈ అసంతృప్తిని చల్లార్చేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రంగంలోకి దిగి పలుమార్లు చర్చించారు. అయినా అసంతృప్తి మాత్రం నివురుగప్పిన నిప్పులానే ఉంది. మెజారిటీ నాయకులు పార్టీ గెలుపుకోసం పనిచేసేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. దీనికి తోడు నియోజకవర్గంలో గత ఐదేళ్ళలో ఎమ్మెల్యేను డమ్మీగా చేసి జిల్లా కీలక నేత, ఆయన అనుచరులు యథేచ్ఛగా సాగించిన ఇసుక, గ్రావెల్ తదితర సహజ వనరుల దోపిడీ ఫ్యాను పార్టీలో గుబులు రేకెత్తిస్తోంది.

ఏకతాటిపైకి టీడీపీ

పెద్దిరెడ్డిని ధిక్కరించి వైసీపీని వీడిన ఆదిమూలంపై ఆ పార్టీలోని ప్రధాన సామాజిక వర్గం చేసిన అమానుష వైఖరి పట్ల దళిత వర్గాల్లో ఆయనకు సానుభూతి పెరిగింది. మంత్రిపై చేసిన విమర్శలను జీర్ణించుకోలేని ప్రధాన సామాజిక వర్గ నేతలు ఆయన దిష్టిబొమ్మలు దహనం చేసిన తీరు ఆదిమూలంకు అమాంతం ఆదరణను తెచ్చి పెట్టింది. ఈ నేపథ్యంలో పెత్తందారులపై చేసిన తిరుగుబాటును గుర్తించి ఆదిమూలంను అనూహ్యంగా టీడీపీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఆరంభంలో టీడీపీ శ్రేణులకు కొంత నిరాశ కలిగించింది. ఆదిమూలం మాత్రం నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తల ఇళ్ళకు వెళ్ళి ఏకతాటి పైకి వచ్చేలా కలుపుకొన్నారు. ఇటీవల నియోజకవర్గంలో చంద్రబాబు నిర్వహించిన పర్యటనతో టీడీపీలో మరింత జోష్ పెరిగింది. ఆదిమూలం స్థానికుడు కావడం, స్వతహాగా ఉద్యమాల నేపథ్యమున్న వారు కావడం, నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, నియోజకవర్గంలోని 700 గ్రామాల్లో ఇరు పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలను పేర్లతో సహా పలకరించడం లాంటి అంశాలు టీడీపీకి కలిసొస్తున్నాయి. నియోజకవర్గంలో తమ జెండా ఎగురవేయడం ఖాయమని టీడీపీ శ్రేణులు బలంగా విశ్వసిస్తున్నాయి.



నూకతోటి రాజేష్

చంద్రబాబు పర్యటనతో వైసీపీలో టెన్షన్

టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల నిర్వహించిన ప్రజాగళం వైసీపీలో టెన్షన్‌కు గురిచేసింది. సత్యవేడులో పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు ఇసుక, గ్రావెల్, మట్టిని దోపిడి చేస్తున్నారని ఆయన చేసిన ఆరోపణలు, ఇక్కడ రాజకీయాలపై పెద్దిరెడ్డి పెత్తనమేంటని చేసిన సునిశిత విమర్శలు నియోజకవర్గ ప్రజల మనసులను సూటిగా తాకాయి. పెద్దిరెడ్డిపై ఆదిమూలం తిరుగుబాటుకు చంద్రబాబు నుంచి వచ్చిన సానుకూల స్పందన దళిత సామాజికవర్గాల్లో చర్చకు దారితీసింది.

ఈ బండే ఆయన విజయరథం

సెంటిమెంట్

రాజకీయాల్లో ఒక్కొక్కరికీ ఓ సెంటిమెంటు ఉంటుంది. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎప్పుడు ఎన్నికల్లో పోటీచేసినా ఏపీ26ఎస్ 0668 నంబరు గల మోటారు సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తుంటారు. బాలాయపల్లి మండలం పెరిమిడికి చెందిన గడ్డం మురళి ఈ వాహనం నడిపితే ఆయన వెనుక కూర్చుంటారు. కొద్దిరోజులుగా ఆ మోటారు సైకిల్ మళ్లీ ఆయన ఇంటివద్ద కనిపిస్తుండటంతో అక్కడి వారంతా ఇదే విషయాన్ని ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. 2009, 2014 ఎన్నికల్లో రామకృష్ణ ఈ మోటర్ సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. రెండు సార్లూ విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం మోటారు సైకిల్ మార్చారు. సెంటుమెంట్ మిస్సవ్వడం వల్లే ఇలా జరిగిందని రామకృష్ణ అనుచరులు భావించారు. తొలుత ఆయన కుమార్తెకు టీడీపీ టికెట్ ఇచ్చినా తాజా మార్పుల్లో రామకృష్ణనే బరిలో నిలపాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. బుధవారం ఆయన 'సెంటిమెంటు బండి' మీదనే వెళ్లి నామినేషన్ వేశారు. దీంతో ఆయన అనుచరులంతా విజయం మనదే అని నినదించారు.

- వెంకటగిరి, డక్కిలి



నామినేషను వేయడానికి తన సెంటిమెంట్ ద్విచక్ర వాహనం మీద వెనుక కూర్చుని వెళ్తున్న కురుగొండ్ల రామకృష్ణ



గెలుపులో మహిళా ఓటర్లే కీలకం

మహిళా ఓట్లు: 7,88,725

పురుష ఓట్లు: 7,65,903

30-39 ఏళ్ల వయసున్న ఓటర్లే అధికం

జిల్లాలో మొత్తం 15,54,712 మంది ఓటర్లుండగా, 30-39 మధ్య వయసున్నవారే ఎక్కువగా 4,06,176 మంది ఉన్నారు.

● తొలిసారి ఓటేసేవారు (18-19 ఏళ్ల వయసు) 33,495 మంది ఉన్నారు.

- చిత్తూరు కలెక్టరేట్



బైండోవర్ అంటే..

ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తుంటారు. బైండోవర్ అంటే (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) అని అర్థం. ఎన్నికల వేళ ఎవరి వల్లనైనా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే పోలీసులు బైండోవర్ చేస్తారు. అనంతరం తహసీల్దార్ లేదా ఆర్డీవో వద్ద హాజరు పరుస్తారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించబోమని అతడి నుంచి బాండ్ పేపర్‌పై లిఖితపూర్వకంగా తీసుకుని అతడికి సంబంధిత తహసీల్దార్లు ప్రొసీడింగ్స్‌ను ఇస్తారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి అదే రోజు నుంచి ఏడాది వరకు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే లిఖితపూర్వకంగా ఇచ్చిన బాండులో ఎంత మొత్తం నమోదు చేసి ఉన్నారో అంతమొత్తం పెనాల్టీ రూపంలో చెల్లించాల్సి ఉంది. అలా చెల్లించకపోయినా నేరం కిందనే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద రెండు, అంతకన్న ఎక్కువసార్లు బైండోవర్ అయితే అతడిపై రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది. తమపై అక్రమంగా పోలీసులు బైండోవర్ కేసులు పెట్టారని ఎవరైనా పౌరులు భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చు. పోలీసులకు నోటీసులు కోర్టు జారీచేసి రెండు వర్గాల వాదనలు విన్నతరువాత కేసుపై నిర్ణయం తీసుకుంటుంది.

- చిత్తూరు

ప్రభుత్వ బడుల్లో తగ్గిన 16 వేల మంది

పునర్విభజన అనంతరం చిత్తూరు జిల్లాలోని 2468 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1,69,191 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంఖ్య 2023-24 విద్యా సంవత్సరం నాటికి 1,52,557కి పడిపోయింది. ఏడాదిలోనే 16,634 మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారు. అదే సమయంలో ప్రైవేటు బడుల్లోని విద్యార్థుల సంఖ్య 2022-23 నాటికి 32792 మంది ఉండగా, 2023-24 నాటికి ఈ సంఖ్య 37772కు చేరింది. అంటే.. ప్రభుత్వ బడులకు దూరమైన విద్యార్థుల్లో 4980 మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారని భావించొచ్చు. మిగిలిన 11,811 మంది విద్యార్థులు బడుల విలీనం కారణంగానే విద్యకు దూరమయ్యారనే చర్చ సాగుతోంది.




ఐరాల మండలం భీమినేనివారిపల్లెలో..



కార్వేటినగరం మండలంలో కలికిరి ఇండ్లులో మూతబడిన పాఠశాల

దీన్నేమంటారు జగన్ మామా..!



అంటరానితనం తన రూపం మార్చుకుంది. పేదలను దూరంగా ఉంచడం మాత్రమే అంటరానితనం కాదు. పేదవారు ఇంగ్లిషు మీడియం చదవొద్దని కోరుకోవడం కూడా అంటరానితనమే.

- విజయవాడలో జనవరి 19న అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలివీ.

ప్రభుత్వం తీసుకున్న పాఠశాలల విలీనం నిర్ణయంతో జిల్లాలో 16,634 మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యారు. వీరిలో కొందరు ప్రైవేటు స్కూళ్లలో చేరితే.. మిగిలిన వారు చదువు మానేశారు. ఇలా చదువుకు దూరం చేయడాన్ని ఏమంటారు జగన్ మామా.. అంటూ ప్రశ్నిస్తున్నారు ఆ నిరుపేద విద్యార్థులు. ఇదీ రూపుమార్చుకున్న అంటరానితనం కాదా అని నిలదీస్తున్నారు.

- చిత్తూరు (సెంట్రల్)

● విలీనంతో ప్రభుత్వ బడులకు పేద విద్యార్థులు దూరం

● ప్రైవేటుకు కొందరు.. చదువుకోలేక మరికొందరు

టీచర్ల కొరతను సర్దుబాటు చేసేశారు

జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదు. ఉన్న టీచర్లు పదవీ విరమణ చెందడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీన్ని పూడ్చేందుకు 2021లో 2008 డీఎస్సీలోని 214 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులను మినిమం టైం స్కేల్ కింద విధుల్లోకి తీసుకుంది. ఆ తర్వాత ఇదే డీఎస్సీలోని మరో 54 మందిని 2023లో రిక్రూట్ చేసుకుంది. అప్పటికీ టీచర్ల కొరత తీరకపోవడంతో 2023లో 1998 డీఎస్సీలోని 614 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులను ఎంటీఎస్ కింద విధుల్లోకి తీసుకుంది. ఇలా మొత్తంగా 882 మంది టీచర్లను ఎంటీఎస్ కింద నియామకం చేపట్టారు. బడుల విలీనంతో టీచర్ల సర్దుబాటు చేశారు. ఇలా ఐదేళ్లుగా విద్యా వ్యవస్థను పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ బడుల్లో చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవడంతోనూ కొన్ని పాఠశాలలు మూతపడ్డాయి.

విద్యా సంవత్సరం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు	టీచర్లు
2019-20	4904	3,43,683	17,230
2020-21	4853	3,66,586	17,233
2021-22	4832	3,75,061	17,454
జిల్లా విభజన తర్వాత			
2022-23	2468	1,69,191	8,466
2023-24	2455	1,52,557	8,680

జగన్ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్య గాడి తప్పింది. నాడు- నేడుతో బడుల రూపు మార్చామని చెప్పినా.. స్కూళ్ల విలీనంతో పేద విద్యార్థులకు చదువును దూరం చేశారు. ఉమ్మడి జిల్లాలో 2021లో బడుల విలీన ప్రక్రియ మొదలుపెట్టి 2023 విద్యా సంవత్సరానికి ముగించారు. 2021 ఆగస్టు 10లోపు 20 బడులను విలీనం చేశారు. 2021-22లో 4832 ప్రభుత్వ పాఠశాలల్లో 3,75,061 మంది విద్యార్థులు ఉన్నారు. 2022 ఫిబ్రవరిలో తొలి విడతగా 316 ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 చదువుతున్న 18207 మంది విద్యార్థులను మూడు కిలోమీటర్ల సమీపంలోని 312 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఒకటి, రెండు తరగతులున్న పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చేశారు. 2022-23లో 2297 ప్రాథమిక పాఠశాలల్లోని 1.20 లక్షల మంది విద్యార్థులను 572 ఉన్నత పాఠశాలల్లోకి సర్దుబాటు చేశారు. మొత్తంగా విలీనం ప్రక్రియ లెక్కల సవరణలు అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 421 పాఠశాలలు విలీనం చేశారు. వీటిలో 225 చిత్తూరు జిల్లాకు సంబంధించినవి.



చిన్నబొమ్మయ్యపల్లెలో మూతపడిన బడి

విద్యార్థులు బడికి రాక..!

వెదురుకుప్పం మండలంలో విద్యార్థులు రాకపోవడంతో చిన్నబొమ్మయ్యపల్లె, గంటావారిపల్లె, సద్దికూళ్లపల్లె, తోటానంపల్లి, వావిలిచేను ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు. ఆయా పాఠశాలల పరిధిలో బడి ఈడు పిల్లలున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల నుంచి విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజన వసతి తదితరాలు కల్పిస్తున్నా.. లోపం ఎక్కడుందో గానీ వీరంతా ఇక్కడ చదివేందుకు ఇష్టపడలేదు. దీనికి కారణం విద్యావ్యవస్థ గాడి తప్పడం అన్న ప్రచారం ఉంది. ఈ క్రమంలో వీరంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరడంతో మూతపడ్డాయి. వాస్తవానికి ఆయా పాఠశాలల పరిధిలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాల్సిన క్షేత్రస్థాయి ఉద్యోగులు కూడా మొక్కుబడిగా చేతులు దులుపుకొన్నారని ఆయా గ్రామస్థులు అంటున్నారు.


- వెదురుకుప్పం

మూత దిశగా ఆరు పాఠశాలలు

గుడిపాల మండలంలోని డీబీపల్లి (దక్షిణబ్రాహ్మణపల్లె), తుమ్మలవారిపల్లె, చలిచీమలపల్లె, పాపిశెట్టిపల్లె (తెలుగు, తమిళ్), తిమ్మయ్యపల్లె, నారగల్లు పాఠశాలలు మూతపడే దశలో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ఇద్దరు చొప్పున విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కో టీచరు వంతున విధులు నిర్వహిస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఈ పాఠశాలలు మూతబడే అవకాశముంది.

- గుడిపాల

ఇద్దరికే పరిమితమైన దక్షణ బ్రాహ్మణపల్లె పాఠశాల



కొక్కువారిపల్లెలో మూత'బడి'

● ఆ దిశగా మరో ఏడు ప్రాథమిక పాఠశాలలు



పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. గతేడాది పాఠశాల పునఃప్రారంభంలోనే విద్యార్థులు లేరిక్కడ. కొవిడ్ అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3280 మంది విద్యార్థులు చదువుతుండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 2788కి పడిపోయింది. ఇక, కూనపల్లెలో నలుగురు, వీసీ వడ్డిపల్లెలో 8, రాజులపల్లె 10, వీకే పల్లె 10, బందారువారిపల్లెలో నలుగురు, చెన్నుపాటివారిపల్లెలో 7, దిన్నెపాటివారిపల్లె 7 మంది చొప్పున విద్యార్థులున్నారు. దీంతో ఈ ఏడు పాఠశాలల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది.

- కల్లూరు

చిత్తూరు పార్లమెంటు వర్తమానం

కంచుకోటలో దూసుకెళ్తున్న టీడీపీ

● అటు స్వతంత్రంగా.. ఇటు ఎమ్మెల్యే అభ్యర్థులతో సమ్వనయంగా ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రచారం

● ఈ ఐదేళ్లూ డమ్మీ ఎంపీగా పేరుగాంచిన వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత చిత్తూరు లోక్‌సభకు పదిసార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాంటి కంచుకోటలో ఈసారి జెండా ఎగరేయాలని టీడీపీ కృతనిశ్చయంతో ఉంది. మరోవైపు ఈ ఐదేళ్లూ రెడ్డెప్ప డమ్మీ ఎంపీగా మిగిలిపోయారు. తాను మాత్రం డమ్మీగా ఉండబోనని.. సమస్యల పరిష్కారానికి పార్లమెంటులో పోరాడతానంటూ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు చెబుతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

తెలుగుదేశం పార్టీ తరపున చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు మాజీ ఐఆర్ఎస్ అధికారి. ఈయన పలు రాష్ట్రాల్లో ఇన్‌కమ్‌ట్యాక్స్ జాయింట్ కమిషనరుగా పనిచేసి ముందస్తు పదవీ విరమణ పొందారు. హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న రాధే కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన్ను టీడీపీ అధినేత చంద్రబాబు చిత్తూరుకు పంపించారు. ఈయన అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచీ తనదైన శైలిలో ఎమ్మెల్యే అభ్యర్థులను కలుపుకొని ముందుకు వెళ్తున్నారు. కుప్పం నుంచి చంద్రగిరి వరకు రోజుకో నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నివాసం, కార్యాలయాన్ని ప్రారంభించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. తక్కువ కాలంలోనే సౌమ్యుడిగా పేరు సంపాదించుకున్నారు.



టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు

అటు సమన్వయంతో..

కుప్పం నియోజకవర్గంలో ఈసారి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంతో శ్రేణులు పనిచేస్తున్నాయి. ఇక్కడ వచ్చే మెజారిటీనే ఎంపీ అభ్యర్థి విజయానికి కలిసొచ్చే అంశం. కుప్పం, పలమనేరు, పుత్తూరు ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఈయన్ను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు పరిచయం చేశారు. పలమనేరులో అమరనాథరెడ్డి, చిత్తూరులో గురజాల జగన్మోహన్, పూతలపట్టులో మురళీమోహన్, జీడీనెల్లూరులో థామస్, నగరిలో గాలి భానుప్రకాష్, చంద్రగిరిలో పులివర్తి నానిని సమన్వయం చేసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులందరి నామినేషన్ల కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఇలా ఎమ్మెల్యే అభ్యర్థులను సమన్వయం చేసుకుంటూనే మరోవైపు తన టీమ్‌తో ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం సాగిస్తున్నారు. ఆయన కుమారుడు రాధే, ఇతర కుటుంబ సభ్యులూ విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో టీడీపీకి అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి.



పెద్దిరెడ్డి కాళ్లు మొక్కుతున్న రెడ్డెప్ప

రెడ్డెప్పపై దళిత సంఘాల్లో ఆగ్రహం

ఇక, తాజా ఎంపీ, వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడు. ఆయన చెప్పింది ఈయనకు వేదం. ఈ ఐదేళ్లూ డమ్మీగానే ఉన్నారు. ఇటీవల మదనపల్లెలో బీఫాం తీసుకుని ఆయన మంత్రి పెద్దిరెడ్డి కాళ్లు మొక్కడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారంటూ ఆ సంఘాల నేతలు మండిపడుతున్నారు. 2019 ఎన్నికల్లోనూ పెద్దిరెడ్డి ఈయనకు టికెట్ ఇప్పించారు. అప్పటి గాలిలో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ మీద రెడ్డెప్ప గెలిచారు. పుంగనూరుకు చెందిన ఈయన.. అసలు చిత్తూరుకు ఎంపీ ఉన్నారనే విషయమే ప్రజలకు గుర్తు లేనంతగా ఆయన వ్యవహరించారు. అంతలా డమ్మీ ఎంపీగా ఉన్న ఆయన్ను ఈసారి తొలుత జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్చి, మళ్లీ చిత్తూరు అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల తరహాలో స్వతంత్రత కలిగిన వ్యక్తిగా కాకుండా, రెడ్డెప్ప పూర్తిగా మంత్రి పెద్దిరెడ్డిపైనే ఆధారపడి ముందుకు సాగుతున్నారు.

తన కుమారుడిని ప్రాణాపాయం నుంచి శత్రువు కాపాడాడని తెలిసి రగిలిపోతాడు. అలాంటి ప్రాణం వద్దని కొడుకునే చంపేస్తాడు.

- ఇదీ 'ఇంద్ర' సినిమాలో ఓ సన్నివేశం.



కుప్పంలో అన్న క్యాంటీన్ నిర్వాహకులతో గొడవ పడుతున్న వైసీపీ శ్రేణులు

ఆకలి పార్టీ ఎరుగదు

వైసీపీ శ్రేణుల కడుపునింపిన అన్నా క్యాంటీన్

మావాళ్ల కడుపు నింపితే ఖబడ్దార్ అంటూ అధికార పార్టీ నేతల గొడవ

అన్న క్యాంటీన్ నిర్వాకులతో గొడవపడ్డ వైసీపీ శ్రేణులు

ఇప్పుడు కుప్పానికి వస్తే..

బుధవారం వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రేణులకు సమయానికి బిర్యానీ ప్యాకెట్లు అందలేదు. ఆకలి పార్టీ ఎరుగదు అన్నట్లు.. వీరంతా టీడీపీ శ్రేణులు అన్నా క్యాంటీన్‌లోకి తమ జెండాలతో దూరారు. 'మావాళ్ల కడుపు నింపితే ఖబడ్దార్' అంటూ అధికార పార్టీకి చెందిన ఇంకొంతమంది కార్యకర్తలు క్యాంటీన్ నిర్వాహకులతో గొడవకు దిగారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా బుధవారం ఆ పార్టీ కుప్పంలో ర్యాలీ నిర్వహించింది. జన సమీకరణకోసం డబ్బు, మద్యం, బిరియానీ.. అంటూ ఏవో ఏర్పాట్లు చేసింది కానీ, కార్యకర్తలకు అవి అందేసరికి చాలా ఆలస్యమే అయింది. ముఖ్యంగా దూర ప్రాంతాలనుంచి ఎప్పుడో వచ్చిన సామాన్య కార్యకర్తలకు మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యేసరికి ఆకలి మొదలైంది. అప్పటికి ర్యాలీ పట్టణంలో కొనసాగుతోంది. అదే సమయంలో ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం జరుగుతోంది. దీంతో కొంతమంది కార్యకర్తలు తామున్న పార్టీ కానీ, ఉన్నది ఆ పార్టీ ర్యాలీలో అని కానీ మరచిపోయారు. చేతిలో ఉన్న వైసీపీ జెండాలను అలాగే పట్టుకుని అన్నా క్యాంటీన్ దగ్గరకు చేరుకున్నారు. తట్టలను పట్టుకుని గుంపులుగా అన్నంకోసం ఎగబడ్డారు. పాపం.. ఆకలిమీదున్నారు. పార్టీ ఏదైతే ఏమిటి.. అనుకున్న టీడీపీ శ్రేణులు వారికి కడుపారా అన్నం పెట్టి ఆకలి తీర్చాయి. తమ పార్టీ కార్యకర్తలు అన్నా క్యాంటీన్‌లో కడుపు నింపుకోవడం చూసిన ర్యాలీలోని కొందరు నాయకులు, ఇతర కార్యకర్తలను ఉసిగొలిపారు. వాళ్లంతా అన్న క్యాంటీన్ నిర్వాహకులైన టీడీపీ శ్రేణులపై విరుకుపడ్డారు. 'మావాళ్ల ఆకలి తీరుస్తారా? మీ అంతు చూస్తామం'టూ గొడవకు దిగారు. 'ఇదేం చోద్యం? ఆకలికి పార్టీలు ఉంటాయా? అకలి అని వచ్చినవారికి ఇంత అన్నం పెట్టి కడుపు నింపడం కూడా తప్పేనా?' అంటూ ఆ పరిసరాల్లోని జనం నోళ్లు నొక్కుకున్నారు. చివరకు భోజనం చేస్తున్న వైసీపీ కార్యకర్తలే తిరగబడడంతో గొడవకు దిగిన ఇతర కార్యకర్తలు సైలెంటైపోయారు. ఆ తర్వాత ఇంకెవరూ అన్నా క్యాంటీన్‌వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

- కుప్పం



మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విద్యుదాఘాతంతో ప్లాస్టిక్ గోదాము దగ్ధం



పూర్తిగా కాలిపోయిన ప్లాస్టిక్ గోదాము

రేణిగుంట, ఏప్రిల్ 24: విద్యుదాఘాతంతో ప్లాస్టిక్ గోదాము దగ్ధమైన ఘటన రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎర్రంరెడ్డిపాళెంలో ప్లాస్టిక్ స్క్రాప్‌ను కరిగించి చిప్స్‌లా తయారు చేసి ప్లాస్టిక్ వస్తువుల తయారీకి విక్రయించే శ్రీరాధే గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. నిమిషాల వ్యవధితో దావానంలా మంటలు వ్యాపించడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. భారీ ఎత్తున మంటలు వ్యాపించడంతో తిరుపతి, పుత్తూరు నుంచి మరో రెండు ఫైరింజన్లను రప్పించి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేయగా ఫైర్ ఇంజన్లలో నీరు అయిపోయింది. దీంతో ఎదురుగా ఉన్న చెరువులో మోటార్లు ఏర్పాటు చేసి నీటి తోడి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ గోదాము పక్కనే ట్రాన్స్‌ఫారం ఉండటంతో షార్ట్ సర్క్యూట్ జరిగి గోదాముకు నిప్పంటుకుందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.28లక్షలు నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు. అయితే గోదాము గతంలో కూడా భారీ అగ్ని ప్రమాదం సంభవించడం గమనార్హం.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు



నిందితుడితో సీఐ దివాకర్‌రెడ్డి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 24: భార్య హత్య కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఐ ప్రతాప్ వివరాలను వెల్లడించారు. వరదయ్యపాళెం మండలం సంతవేలూరు పంచాయతీ సాధనవారిపాళెం గ్రామానికి చెందిన తూకివాకం రాజశేఖర్ ఏప్రిల్ 19వ తేదీ రాత్రి తన భార్య అంజలి(24)తో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో భార్య గొంతు నులమడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమె తల్లిదండ్రులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ 20వ తేదీన మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ - సూళ్లూరుపేట మార్గంలో సాధనావారిపాళెం బస్టాప్ వద్ద నిందితుడు రాజశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



వైష్ణవి, చర్మిళ, రిషిత, కార్తీక్, గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

ఉమామహేశ్వరాలయ కుంభాభిషేకోత్సవాలు



నూతనంగా నిర్మించిన ఆలయం

సత్యవేడు, ఏప్రిల్ 24: సత్యవేడు మండలం ఇరుగుళంలో ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు ధర్మకర్త ఎంపీపీ ప్రతిమ, సుశీల్‌కుమార్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ఆలయంలో గణపతి హోమం, లక్ష్మీనవగ్రహ హోమం, గోపూజ, యాగశాల నిర్మాణం, దీపారాధన తదుపరి నూతన విగ్రహాలు గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో అంకురార్పణం, రక్షాబంధనం, ద్రవ్యాహుతి, కళాకర్షణ, యాగశాల ప్రవేశం, మొదటికాల యాగశాల పూజలు, పూర్ణాహుతి, మహాదీపారాధన తదితర క్రతువులన్నీ తమిళనాడు మీంజూరుకు చెందిన రుత్వికులు త్యాగరాజు గురుకుల్, బాలాజీశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు మహాకుంభాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ముక్కంటి ఆలయ హుండీ ఆదాయం రూ.1.84 కోట్లు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24: ముక్కంటి ఆలయ హుండీ ఆదాయం రూ.1.84కోట్లు వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. రూ.1,84,37,260 నగదుతో పాటు బంగారం 121.5 గ్రాములు, వెండి 607.450 కిలోలు, వివిధ దేశాలకు చెందిన 122 నోట్ల విదేశీ కరెన్సీ వచ్చింది.

టీచర్ గుణశేఖర్ రెడ్డి డిప్యుటేషన్ రద్దు చేయండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24: ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుణశేఖర్ రెడ్డి డిప్యుటేషన్ రద్దు చేయాలని టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏర్పేడు మండలం బండారుపల్లి జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా పని చేయాల్సిన గుణశేఖర్ రెడ్డి... డిప్యుటేషన్‌పై శ్రీకాళహస్తి వయోజన విద్య విభాగంలో సూపర్‌వైజర్‌గా కొనసాగుతున్నారు. వైసీపీ ముఖ్య నేతలతో సన్నిహితంగా ఉండే గుణశేఖర్ రెడ్డి డిప్యుటేషన్ రద్దుచేసి ఎన్నికల విధులు కేటాయించాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు స్పందిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదును అనుసంధానం చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

వైసీపీ భూతం భూస్థాపితం: సుధీర్‌రెడ్డి



సుధీర్ రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న 19వ వార్డు ప్రజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24: అన్ని వర్గాల ప్రజలను దారుణంగా పీడించిన వైసీపీ భూతం వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం కావడం తథ్యమని ఎన్డీఏ కూటమి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని 19వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు గజమాలలు, శేష వస్త్రాలతో సత్కరించి మంగళ హారతులతో అఖండ స్వాగతం పలికారు. తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించని వైసీపీ వచ్చే ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ నేతలు వలంటీర్లను బెదిరించి తమ స్వార్థ ప్రయోజనాల కోసం బలవంతంగా రాజీనామాలు చేయించడం బాధాకరమన్నారు. వలంటీర్లకు గౌరవ వేతనం రెట్టింపు చేస్తామని చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. ఇక సాయంత్రం 27వ వార్డులో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటుపై వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్, కంఠా రమేష్, బీజేపీ నాయకులు అమర్నాథ్, జనసేన నాయకులు కొట్టే సాయి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ బీసీ నాయకులు పోలూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ సమావేశం జరిగింది. మిన్నల్ రవి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గొలపల్లి సర్పంచు

ఏర్పేడు: పల్లం గొల్లపల్లి పంచాయతీ సర్పంచు సీమల గోపాల్‌యాదవ్ బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు వైసీపీ నాయకులు మణియాదవ్, నాగేశ్వరరావు యాదవ్, తిరుపాల్‌నాయుడు, పెంచలనాయుడు టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



గోపాల్‌యాదవ్‌తో సుధీర్‌రెడ్డి

ఎన్డీఏ కూటమి విజయం తథ్యం: వరప్రసాద్



టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి నామినేషన్ దాఖలు చేస్తున్న వరప్రసాద్

వెంకటాచలం/గూడూరు, ఏప్రిల్ 24: అడ్డంగా దోచేసిన డబ్బులను అధికార పార్టీ నాయకులు వెదజల్లినా వారికి ఓటమి తప్పదని, ఎన్డీఏ కూటమి విజయం తథ్యమని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం తిరుపతి లోక్‌సభ పరిధిలోని సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో వరప్రసాదరావు పాల్గొన్నారు. ముందుగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ నిర్వహించారు. వెంకటాచలంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు. అనంతరం వరప్రసాదరావు మాట్లాడుతూ... ఓటమి తప్పదని గ్రహించిన వైసీపీ నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు, రకరకాల ప్రలోభాలకు తెరదీస్తున్నారన్నారు. అందులో భాగంగానే సర్వేపల్లి నియోజకవర్గంలో విచ్చలవిడిగా మద్యాన్ని డంప్‌చేసి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోతున్నారని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్ యాదవ్, అమీర్‌బాషా తదితరులు ఉన్నారు.

ఎన్డీఏ హామీలను ప్రజలకు తెలియపరచాలి

ఎన్డీఏ మిత్రపక్షాలు ఇచ్చిన హామీలను ప్రజలకు తెలియపరచి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసేలా కృషి చేయాలని వరప్రసాదరావు దిశానిర్దేశం చేశారు. గూడూరులో తనను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులకు... నియోజకవర్గంలో తానుచేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. కూటమి గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుషోత్తమరెడ్డి, చిల్లకూరు జడ్పీటీసీ సభ్యుడు మన్యం శ్రీనివాసులు, వరగలి ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, పరమేష్, తిప్పనూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన జనసేన నాయకుడు హరిబాబును కలుసుకొని మద్దతు కోరారు. చెన్నూరుకు చెందిన టీడీపీ నాయకుడు టి.రాఘవరెడ్డితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.



వరప్రసాదరావు సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

దోపిడీదారులకు అవకాశం ఇవ్వొద్దు: ఆదిమూలం



వీఆర్ కండ్రిగలో ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 24: ప్రశాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో అరాచక వాదులకు, దోపిడీ దారులకు అవకాశం ఇవ్వొద్దని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సత్యవేడు మండలంలోని మదనంజేరి, బాలకృష్ణాపురం, కాదిరివేడు, వీఆర్ కండ్రిగ, మదనంబేడు గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో తిరోగమించిందని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మకుండా, ప్రలోభాలకు లొంగకుండా విజ్ఞతతో కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మస్తాన్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పరమశివం, శివకుమార్, శ్రీనివాసయాదవ్, రాంప్రకాష్ యాదవ్, అన్ను, మునిప్రతాప్, మునికృష్ణయ్య, రూపేష్ కుమార్, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి

ఏర్పేడు, ఏప్రిల్ 24: టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం మాధవమాల, ఇసుకతాగేలి, అంజిమేడు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధనంజయులు నాయుడు, గురవారెడ్డి, పొన్నారావు, చంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్‌నాయుడు, రవినాయుడు, మునిరామిరెడ్డి, హంస, కృష్ణవేణి, రాచేటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాధవమాలలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వేడుకగా ముత్యాలమ్మ జాతర



విశేషాలంకారంలో ముత్యాలమ్మ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయంలో జాతర వేడుకగా జరిగింది. మూడు రోజులు పాటు జరిగే జాతరలో బుధవారం రెండో రోజు విశేష పూజలు జరిగాయి. ముందుగా అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. ఆ తర్వాత మూలమూర్తి ఎదుట పోతురాజు ముగ్గు వేసి నైవేద్యం సమర్పించారు. గంగ పెట్టిని సంప్రదాయబద్ధంగా అలంకరించి హారతులు ఇచ్చారు. అనంతరం గంగ పెట్టిని శిరస్సుపై దాల్చి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయంలో రేణుకాదేవి ముగ్గు వేసి హారతులిచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, అమ్మవారికి అంబళ్లు సమర్పించారు. భక్తులకు అంబళ్లను ప్రసాదాలుగా పంచి పెట్టారు. అలాగే అమ్మవారికి కోళ్ల యాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మహిళలు



రేణిగుంట, ఏప్రిల్ 24: రేణిగుంట పట్టణం వేణుగోపాలపురానికి చెందిన పలువురు మహిళలు టీడీపీలో చేరారు. బుధవారం సాయంత్రం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి వేణుగోపాలపురంలో ఇంటింటి ప్రచారం చేశారు.

లేడీ డాక్టర్ ఆత్మహత్య?

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24: అనుమానాస్పద స్థితిలో ఓ లేడీ డాక్టర్ మృతి చెందడం కలకలం సృష్టించింది. శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేట ప్రాంతానికి చెందిన రాజేష్ రెడ్డి జనరల్ ఫిజీషియన్‌గా స్థిరపడ్డారు. తమిళనాడుకు చెందిన అశ్విని(38)కి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. మేనమామ సంరక్షణలో అశ్విని ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఎనిమిదేళ్ల క్రితం రాజేష్ రెడ్డితో వివాహం జరిగాక కొత్తపేటలో ప్రైవేటు క్లినిక్ నిర్వహించేవారు. వీరికి ఏడేళ్ల పాప ఉంది. బుధవారం ఉదయం అశ్విని మృతి చెందినట్లు సమాచారం అందడంతో శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ రారాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమిళనాడులోని అశ్విని బంధువులకు సమాచారం ఇచ్చారు. రాత్రి టిఫిన్ బాగా లేదన్న విషయమై దంపతుల మధ్య వాగ్వాదం జరిగిందని రాజేష్ పోలీసులకు వెల్లడించారు. ఆ తర్వాత ఇద్దరు వేర్వేరు బెడ్ రూముల్లో నిద్రించినట్లు తెలిపాడు. ఉదయం ఆమె బెడ్ రూమ్‌లోని కిటికీ గ్రిల్స్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేస్తుందని... అది చూసి మృతదేహాన్ని కిందకు దించి పడుకోబెట్టినట్లు వివరించాడు. ఆ తర్వాత డాక్టర్ రాజేష్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అశ్విని కుటుంబ సభ్యులు తమిళనాడు నుంచి శ్రీకాళహస్తికి చేరుకున్న తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని సీఐ రారాజు తెలిపారు.

పుత్తూరు వార్తలు

రోజాను ఓడించండి: కందారపు మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కందారపు మురళి

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 24: త్వరలో జరిగే ఎన్నికల్లో రోజాను ఓడించి, ఇండియా కూటమి బలపరచిన అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలపించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో బుధవారం సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మురళి, వాడ గంగరాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చి 46 కార్మిక చట్టాలను కాలరాసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో జగన్ సంక్షేమ పథకాల పేరుతో జనాన్ని మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు సుబ్రహ్మణ్యం పిళ్లై, పురుషోత్తం, భాస్కర్, దళిత నాయకులు నందయ్య, యాసిన్ బాష, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటకాల రాణిని నమ్మొద్దు: భానుప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24: 'సకుటుంబ సపరివార సమేతంగా నగరి నియోజకవర్గాన్ని మంత్రి రోజా దోచుకుంది. 2014కు ముందు ఆమె ఆర్థిక పరిస్థితి ఏమి... ఇప్పుడు ఇన్ని వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి. నగరి రక్తాన్ని పిండుకుని ఆస్తులు సంపాదించింది' నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం బజారువీధిలో మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్(అమ్ములు) ఆధ్వర్యంలో టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటకాల రాణి రోజాను మరోసారి నమ్మి మరోసారి మోసపోవద్దని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. శాంతిభద్రతలకు చిరునామాగా ఉన్న పుత్తూరును అరాచకాలకు, దౌర్జన్యాలు, కబ్జాలకు నెలవుగా మంత్రి రోజా మార్చిందని ధ్వజమెత్తారు. వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యంలో ఏపీఐఐసీ ద్వారా భూమి సేకరించి టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇచ్చిన వ్యవహారంలో బినామీలతో డీకేటీ పట్టాలిప్పించి దేవస్థానం డబ్బును కూడా వదలకుండా దోచుకుందని మండిపడ్డారు. మాజీ ఎంపీపీ డీఎస్ ఏలుమలై మొదలియార్(అమ్ములు) టీడీపీలో చేరడం శుభపరిణామని భానుప్రకాష్ అన్నారు. ఏలుమలై మాట్లాడుతూ భారీ మెజార్టీతో గాలి భానుప్రకాష్‌ను గెలిపించుకుందామని ప్రతిన బూనారు. గేటు పుత్తూరు, కల్యాణపురం, నందిమంగళం దళితవాడకు చెందిన సుమారు వందమంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కరుణాకరన్, డీఎస్ గణేష్, షణ్ముగరెడ్డి, డీజీ, ధనపాల్, అశోక్, గాలి జీవరత్నంనాయుడు, గంజి మధవయ్య, ఎస్ఎన్ ధనపాల్, అంకయ్య, కౌన్సిలర్ భువనేశ్వరి, డాక్టర్ బసంతి, లక్ష్మీపతి, వెంకటమునిమేస్త్రి, జనసేన సమన్వకర్త మహేష్, పట్టణ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

ప్రతి ఓటూ కీలకమే

నారాయణవనం, ఏప్రిల్ 24: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమేనని జడ్పీటీసీ సుమన్‌కుమార్ చెప్పారు. బుధవారం నారాయణవనంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఓటరునూ కలిసి వైసీపీ ప్రభుత్వ అక్రమాల గురించి వివరించాలని, అలాగే టీడీపీ అందించనున్న సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. సత్యవేడు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆదిమూలం గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, మండలాధ్యక్షులు గిరిబాబు, షణ్ముగం, సీఎస్.రవి, హరి, సుబ్రహ్మణ్యం, మాణిక్యం, ఊరప్ప, వేలురెడ్డి, విజయ్, పురుషోత్తం, ఆనంద్, శ్రీరామ్ తదతరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుమన్ కుమార్



చింతకాల్వలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ దుర్మార్గాలకు స్వస్తి పలుకుదాం: టీడీపీ

వడమాలపేట, ఏప్రిల్ 24: వైసీపీ దుర్మార్గాలకు స్వస్తి పలుకుదామని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం వడమాలపేట మండలంలోని పత్తిపుత్తూరు, చింతకాల్వ, పచ్చికాపల్లం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, వెంకటయ్య, మునిరత్నం, శేషాద్రి నాయుడు, గోవిందస్వామి, సుబ్రహ్మణ్యం, గజేంద్ర, హేమావతి, లక్ష్మీప్రసన్న, రవినాయుడు, రామూర్తినాయుడు, రమేష్, కుమార్, మునిరెడ్డి, సురేష్‌బాబు, బాలాజీ, మునిశేఖర్, మురళి, కుచేలుడు, నరసింహులు చిన్నబ్బ, మోహన్, వాసు, ఉపేంద్ర, ఖాదర్, బాషా, జనసేన నాయకులు మునిశేఖర్, బాలాజీ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.